

పథకం కోసం తరలించిన పైపులు


మళ్లీ.. హ్యాపీనెస్ట్

నాడు రూ.714 కోట్లు..
నేడు రూ.930 కోట్లు

హ్యాపీనెస్టు గేటెడ్ కమ్యూనిటీలోని ఫ్లాట్లను కొనుగోలుదార్లకు 2021 నాటికే అప్పగించాలి. అయితే వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ప్రాజెక్టు పనులు అటకెక్కాయి. తొలుత రూ.714 కోట్ల ప్రాజెక్టును షాపూజీ పల్లోంజీ పనులు చేపట్టగా రివర్స్ టెండరింగ్ అంటూ జగన్ ప్రభుత్వ నిర్ణయంతో పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితుల్లో విపరీతమైన జాప్యంతో నిర్మాణ వ్యయం ప్రస్తుతం రూ.930 కోట్లకు పెరిగింది. గత డిసెంబరులో టెండర్లను పిలవగా ఎన్‌సీసీ సంస్థ ప్రాజెక్టును దక్కించుకుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (మంగళవారం సాయంత్రం)
సహరి : 4.52 (బుధవారం ఉదయం)

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు ఊహాచిత్రం


రాజధాని అమరావతిని అత్యద్భుతంగా నిర్మించే క్రమంలో అత్యాధునికంగా.. ఆహ్లాదకరంగా.. అంతర్జాతీయ స్థాయి వసతులతో హ్యాపీనెస్ట్ పేరుతో గృహ సముదాయాలకు గత టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. ప్రజల నుంచి ఊహించని స్పందన రావడంతో ఫ్లాట్ల బుకింగ్‌లు శరవేగంగా జరిగాయి. ఇక రాజధానిలో తమ కలల గృహం.. కృష్ణా నదీ సమీపంలో నేలపాడులో నిర్మాణం జరుగుతుందని ఫ్లాట్ల కొనుగోలుదారులు ఆనంద డోలికల్లో ఉన్నారు. అయితే వారి కలలను కల్లలు చేస్తూ.. వారి ఆశలను చిదిమేస్తూ గత వైసీపీ ప్రభుత్వం అమరావతి తో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును కూడా పక్కన పెట్టేసింది. రూ.లక్షలు చెల్లించిన వారు గత ఐదేళ్లు ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం.. అమరావతిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో హ్యాపీనెస్టు కొనుగోలుదారుల్లో ఆశలు చిగురించాయి. వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిన హ్యాపీనెస్టు ప్రాజెక్టును చంద్రబాబు పట్టాలపైకి తీసుకురావడంతో కొనుగోలు దారుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. జగన్ ప్రభుత్వమే తమను మోసం చేసిందని ఆందోళన చెందుతున్న ఫ్లాట్ల కొనుగోలుదార్లకు కూటమి ప్రభుత్వం అభయమిచ్చి పాత రేట్లపైనే నిర్మాణాలు పూర్తి చేసి అప్పగించేలా విధాన నిర్ణయాన్ని ప్రకటించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సీఆర్‌డీఏ రీ టెండర్లు నిర్వహించగా నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పనులను దక్కించుకుంది. త్వరలో హ్యాపీనెస్టు పనులు ప్రారంభం కానున్నాయి.



కొనుగోలు దార్లకు అభయం

- ప్రాజెక్టును పట్టాలెక్కిస్తోన్న ప్రభుత్వం
- రీ టెండర్.. నేలపాడులో పనులు ప్రారంభం
- పాత రేట్లపైనే పూర్తి చేసి అప్పగిస్తామని ప్రకటన
- జగన్ నిర్వాకంతో రూ.216 కోట్లు పెరిగిన వ్యయం

ప్రాజెక్టు స్థలం వద్ద జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న ఎక్స్‌కవేటర్


(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో జనాభాను పెంచే లక్ష్యంతో 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును చేపట్టింది. నేలపాడు వద్ద హ్యాపీనెస్ట్ పేరుతో గేటెడ్ కమ్యూనిటీని నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. అయితే ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతితో పాటు హ్యాపీనెస్టు ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో హ్యాపీనెస్ట్‌లో ఫ్లాట్ల కోసం డబ్బులు చెల్లించిన అనేకమంది గగ్గోలు పెట్టారు. కొందరు ఒత్తిడి చేసి డబ్బులను వెనక్కు తీసుకోగా.. మరికొందరు దింపుడు కళ్లం ఆశతో ఎదురుచూశారు. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు హ్యాపీనెస్ట్‌కు డబ్బులు చెల్లించిన వారందరికీ తీపి కబురు చెప్పారు. ఐదేళ్లపాటు ఆలస్యమైనా.. నిర్మాణ వ్యయం రూ.216 కోట్ల మేర పెరుగుతున్నా దానిని సీఆర్‌డీఏనే భరిస్తుందంటూ బాధిత ప్లాట్ల దారులకు అభయమిచ్చి వారిలో ప్రభుత్వంపై నమ్మకాన్ని కల్పించారు.

2బీ+జీ+18 అంతస్తులుగా 12 టవర్లు

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును గత టీడీపీ ప్రభుత్వం

(మిగతా 6వ పేజీలో)

అనుసంధానం.. ఆలస్యం

- గోదావరి జలాలు బనకచర్లకు తరలింపుపై ఖరారు కాని డిజైన్
- భూ సేకరణ ప్రక్రియను నిలిపేసిన రెవెన్యూ శాఖ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నదుల అనుసంధానానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ.. 2026 జూన్ కల్లా పూర్తి చేయడమే లక్ష్యంగా చేపట్టిన జలహారతి ప్రాజెక్టు ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. జలహారతి పేరుతో చేపట్టిన పనులు భూ సేకరణ దశలోనే ప్రస్తుతానికి ప్రభుత్వం ఆపేసింది. జలహారతిలో గోదావరి-బనకచర్ల అనుసంధానానికి ప్రభుత్వం గతంలో ప్రణాళికను విడుదల చేసింది. ఈ పనులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను కూడా ప్రారంభించింది. అయితే ఇంత వరకు ప్రక్రియ వేగంగా జరగడంతో గోదావరి జలాలు కుడి కాల్వకు వచ్చే కాలం అతి దగ్గరలోనే ఉందని ఆయకట్టు రైతులు ఆశపడుతున్నారు. అయితే వారిని నిరాశపరుస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టు భూసేకరణ దశలో నిలిపివేయడంతో కుడి కాల్వకు గోదావరి జలాలు తరలించే ఎత్తిపోతల పథకం నిర్మాణంలో తీవ్ర జాప్యం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రైతులు అసంతృప్తికి లోనవుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపు

జలహారతి తొలివిడత ప్రయోజనం నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ఆయకట్టు రైతులు పొందుతారు. గోదావరి జలాలను బొల్లాపల్లి జలాశయంలో నిల్వ చేసి అక్కడి నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలించేందుకు ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణ చేపట్టారు. ఈ పనులను మూడు దశల్లో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలు మళ్లించి కుడి కాల్వ ఆయకట్టు 9.61 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. రూ.6020 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించగా రూ.465 కోట్ల పనులు పూర్త య్యాయి. రెండో ప్యాకేజీలో రెండు పంపు హౌస్ లు నిర్మించాలి. 5.65 కిమీ మేర ఆరు వరసల పైపులు ఏర్పాటు చేయాలి. మరో 15.95 కిలో మీటర్లు కాల్వ తవ్వాలి. రెండు సబ్ స్టేషన్లు నిర్మించాలి. ఈ ప్యాకేజీలో రూ.550 కోట్ల పనులు పూర్తి చేశారు. మరో 2,105.82 కోట్ల పనులు చేయాల్సి ఉంది. రెండు ప్యాకేజీలకు సంబంధించి సుమారు 466.31 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇందుకు రూ.181కోట్ల వ్యయం అవుతుందని రెవెన్యూ శాఖ అంచనా వేయగా ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. దీంతో భూ సేకరణకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ దశలో గోదావరి జలాలను బనకచర్లకు తరలించే ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ డిజైన్‌కు తుది రూపు వచ్చే వరకు భూసేకరణను వాయిదా వేశారు. దీంతో భూసేకరణను రెవెన్యూ శాఖ నిలిపివేసింది. డిజైన్‌ను ప్రకటించిన అనంతరమే భూసేకరణ ప్రారంభించాలని ప్రభుత్వం సూచించినట్లు అధికారులు చెబుతున్నారు. అమరావతి, క్రోసూరు, రాజుపాలెం నకరికల్లు మండలాల పరిధిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్ణయం కోసం రెవెన్యూ అధికారులు ఎదురు చూస్తున్నారు.


నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తిపోతల పథకానికి నాడు సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

ప్రథమ పౌరులుగా గుర్తించాలి

- రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలి
- సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు రాజధాని గ్రామాల రైతులు వినతి
- ప్రతీ గ్రామానికి డీపీఆర్ :ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తుళ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో 2014 డిసెంబరు 8 వరకు నివాసం ఉంటున్న వారిని ప్రథమ పౌరులుగా గుర్తించాలి. గత టీడీపీ ప్రభుత్వం కల్పించిన ఉచిత విద్య, వైద్యాన్ని పునః ప్రారంభించాలి. అప్పట్లో ఇచ్చిన హెల్త్ కార్డులు ఇప్పుడు పని చేయడం లేదు. తిరిగి పథకం అమలు చేయాలి.' అని రాజధాని గ్రామాల రైతులు, కూలీలు సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబును కోరారు. రాజధాని గ్రామాల రైతులు, కూలీలతో సోమవారం తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు సమస్యలను రాజధాని గ్రామాల రైతులు కమిషనర్, ఎమ్మెల్యేకి ఏకరువు పెట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ముంపు ప్రాంతమని అమరావతిని అవహేళన చేసిందని, ఈ పరిస్థితుల్లో పూడిపోయిన వాగులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచించారు. రైతుల ప్లాట్లలో వచ్చే వసతులన్నీ గ్రామాల్లోనూ కల్పించాలన్నారు. రాజధానిలో పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.12 వేలు ఇస్తున్నారని దానిని మున్సిపాల్టీల్లో ఇస్తున్నట్లు రూ.21 వేలకు పెంచాలని సీపీఎం రాష్ట్ర సహాయక కార్యదర్శివర్గసభ్యుడు సీహెచ్ బాబురావు తెలిపారు. రాజధాని గ్రామాలలో పేదలకు ఉచిత సోలార్ పథకం అమలు చేయాలన్నారు. గ్రామ కంఠాల సమస్యలను పరిష్కరించాలన్నారు. అసైన్డ్ రైతులు కొందరికే కౌలు జమయ్యాయని మిగిలిన వారికి జమ చేయాలని దళిత జేఏసీ నేత చిలకా బసవయ్య తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రైతులు చెప్పిన సమస్యలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణాలను ఎంత వేగంగా చేస్తున్నామో అంతేవేగంగా గ్రామాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రైల్వే ట్రాక్‌కు స్వచ్ఛందంగా భూములు ఇచ్చేందుకు పెదపరిమి, తాడికొండ రైతులు ముందుకొస్తున్నారన్నారు. హామీ లేకుండా రూ.25 లక్షల వరకు ఇచ్చే రుణాలను అమలు చేయాలన్నారు. గ్రామాల అప్రోచ్ రోడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల వారీగా డీపీఆర్లు తయారు చేసి పూర్తి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అమరావతి పింఛన్ అమలు చేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్


సమావేశానికి హాజరైన రైతులు, రైతు కూలీలు

గ్రామస్థులతో సీఎం పర్యటనపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


కొత్తగొల్లపాలేనికి చంద్రబాబు

- 1న సీఎం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు
- పరిశీలించిన జేసీ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే ఏలూరి

చిన్నగంజాం(పర్చూరు), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేదల సేవలో భాగంగా ఏప్రిల్ 1న ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దగంజాం పంచాయతీ పరిధిలోని కొత్తగొల్లపాలెం గ్రామంలో పర్యటించనున్నారు. సామాజిక పింఛన్ల పంపిణీకి చంద్రబాబు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలాన్ని ఎంపిక చేశారు. గ్రామంలో సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులతో, కార్యకర్తలతో ముఖాముఖి సభ వేదికలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ వద్ద గ్రామస్థులతో ఏలూరి ముచ్చటించారు. చంద్రబాబు పర్యటనను ప్రజలు పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామంలో 100శాతం సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, నివాస గృహాలు, రైతులకు అగ్రికల్చర్ కనెక్షన్లు, యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఏలూరి అధికారులకు సూచించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేవిధంగా ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల ఆర్డీవోలు చంద్రశేఖర్, గ్లోరియా, డీఎస్పీలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్తు టాబ్లెట్ల కేసులో.. పోలీసుల అదుపులో మరొకరు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మత్తు టాబ్లెట్ల కేసుకు సంబంధించి బాపట్ల రూరల్ పరిధిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇటీవల టాబ్లెట్లతో పట్టుబడిన మహిళతో పాటు, పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తిని విచారణ చేయగా డ్రగ్స్ అవశేషాలు కలిగిన మాత్రల వెనక జిల్లాలోని కొన్ని మెడికల్ షాపుల హస్తం ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. కానీ నిబంధనల ప్రకారం జిల్లాలోని ప్రతిషాపును జల్లెడ పట్టే అధికారం అటు ఎక్సైజ్ విభాగానికి, ఇటు సివిల్ పోలీసులకు లేకపోవడంతో డ్రగ్స్ విభాగం అధికారులతోనే దర్యాప్తును చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రత్యేకం గా ఏర్పాటు చేసిన ఈగల్ టీం పర్యవేక్షణతో పాటు డ్రగ్స్ విభాగం సమన్వయం చేసుకుని విచారణ ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది.

సమస్యల చిట్టాతో.. కలెక్టర్ల సదస్సుకు..

- ఏటీఆర్‌లతో పాటు.. ప్రస్తుత ప్రణాళికలతో సిద్ధం
- జిల్లాకు సంబంధించి పలు సమస్యలపై పీపీటీ
- రేపు హాజరు కానున్న ఎస్పీ.. శాంతిభద్రతలే అజెండా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగబోతున్న మూడో కలెక్టర్ల సదస్సుకు బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి పూర్తిస్థాయిలో సమాయత్తమయ్యారు. జిల్లాకు సంబంధించిన కీలక అంశాలను ప్రజంటేషన్‌లో పొందుపరిచి సీఎం, మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రెటరి, వివిధ శాఖల ఉన్నతాధికారుల సమక్షంలో నివేదించేందుకు సిద్ధమయ్యారు. సదస్సులో చర్చకు వచ్చే అంశాలపైనే గత వారం రోజులుగా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కసరత్తు చేసి నివేదికలు సిద్ధం చేసుకున్నారు. ఇంతకుముందు రెండుసార్లు జరిగిన కలెక్టర్ల సదస్సులో చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారం విషయంలో పురోగతి ఏమిటన్న దానిపై ఏటీఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్టు)ను సీఎంకు అందించనున్నట్లు తెలుస్తోంది. డీఆర్సీతో సమావేశంతోపాటు జిల్లా పరిషత్ మీటింగ్‌లో జిల్లాకు సంబంధించి ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లాకు సంబంధించి సవివర నివేదికను సదుస్సులో చర్చించనున్నట్లు సమాచారం. గతంలో జరిగిన సదస్సులో జిల్లాకు సంబంధించి చర్చకు వచ్చిన ధాన్యం సేకరణ, కాల్వల బాగు, పర్యాటకరంగ అభివృద్ధి విషయంలో సంతృప్తికర ఫలితాలు సాధించినట్లు కలెక్టర్ సీఎంకు వివరించనున్నట్లు సమాచారం. వేసవి నీటి సమస్య, రబీలో ధాన్యం సేకరణ, స్వర్ణాంధ్ర-2047 దిశగా తీసుకోవాల్సిన చర్యలు, పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధి ప్రణాళికలు, నిజాంపట్నం మండల పరిధిలోని దిండి వద్ద ఆక్వా పార్కు నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు ఉన్న అడ్డంకులు, నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులు, సమీకృత కలెక్టరేట్ నిర్మాణం వంటి సమస్యల చిట్టాను కలెక్టర్ ఈ సదస్సులో నివేదించనున్నారు. మరమ్మతులకు నోచుకోని కాల్వల పూడికతీతకు మూడున్నర కోట్లు ఖర్చు చేసినట్లు, ఇంకా దాదాపు రూ.5 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఏటీఆర్‌లో పొందుపరిచినట్లు తెలుస్తోంది. పర్యాటకరంగ అభివృద్ధికి జిల్లాలో అపార అవకాశాలు ఉన్నందున వాటి మీద దృష్టి పెట్టాలని గత సదస్సులో సీఎం సూచించారు. దానిలో భాగంగా ఇప్పటికే రూ.40 లక్షలు నిధులు విడుదల చేయడంతో పాటు ఇటీవల చేపట్టిన బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని కూడా ఈ సదస్సులో కలెక్టర్ వివరించనున్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో వివిధ సమస్యలపై వచ్చిన వినతుల్లో ప్రాధమ్యాలకు అనుగుణంగా 280 పనులను ఎంపిక చేసుకుని వాటికోసం ఇప్పటికే దాదాపు రూ.7 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ఏటీఆర్‌లో భాగంగా కలెక్టర్ నివేదించనున్నారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికలను 12 విభాగాలుగా విభజించి పీపీటీ రూపంలో సదస్సులో సీఎంకు వివరించనున్నట్లు సమాచారం.మోటుపల్లిలో నౌకనిర్మాణ కేంద్రం ఏర్పాటుకు కేంద్రం అనుకూలంగా ఉండడంతో రాష్ట్రప్రభుత్వం వైపు నుంచి తీసుకోవాల్సిన చర్యల అంశం సదస్సులో భాగం కానున్నాయి

రేపు హాజరుకానున్న ఎస్పీ..

సదస్సుకు ఎస్పీ తుషార్‌డూడీ బుధవారం హాజరుకానున్నట్లు సమాచారం. జిల్లాలో క్రైం రేటును సదస్సులో ఆయన వివరించనున్నారు. కీలకమైన మూడు కేసుల సిట్ విషయంలో సారథిగా ఎస్పీ ఉన్నారు. ఇందులో రెండు నెల్లూరు కేంద్రంగా ఉన్న భూ సంబంధమైన అంశాలుకాగా, మరొకటి పల్నాడు జిల్లా పరిధిలో ఓ ప్రైవేటు చిట్ సంస్థ అక్రమాలకు సంబంధించింది. వీటి పురోగతి కూడా సదస్సులో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రూ. 63 లక్షల పంచాయతీ నిధుల స్వాహా


సర్పంచ్ నోముల కృష్ణ

● కొప్పునూరు వైసీపీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు..?
● షోకాజు నోటీసు జారీ.. ● డీపీవో విచారణ

మాచర్లటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో అభివృద్ధి పనుల కోసం మంజూరైన పంచాయతీ నిధులను ఆ గ్రామ సర్పంచ్ తన పలుకుబడితో అప్పటి పంచాయతీ సెక్రటరీతో కలిసి స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాచర్ల మండలంలోని కొప్పునూరు గ్రామ పంచాయతీకి గత వైసీపీ ప్రభుత్వంలో రూ. 63 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ గ్రామ సర్పంచ్ నోముల కృష్ణ ఆ నిధులను కాజేసి తన జేబులో వేసుకున్నాడు. అప్పటి ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న నేతల సహకారం ఉండడంతో అధికారులు కూడా ఎదురు చెప్పలేక జీహుజూర్ అన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు కోసం వెచ్చించాల్సిన ఆ నిధులను ఏ పనులు చేయకుండానే అభివృద్ధి పనులు చేసినట్లు తీర్మానం చూపించి సొమ్మంతా డ్రా చేసుకున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సర్పంచ్ నిధులు దుర్వినియోగాన్ని గ్రామస్థులు శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో డీపీవోను విచారణ చేపట్టాలని లేఖ రాశారు. దీంతో అధికారుల తనిఖీలో సర్పంచ్ కృష్ణ ఖాతాకు రూ. 51 లక్షలు, బూడిద సైదులు ఖాతాకు రూ. 3 లక్షలు, పంచాయతీ డీఈవో జానీబాషాకు రూ. 2.50 లక్షలు జమ అయినట్లు గుర్తించారు. ఈ పంచాయతీ పరిధిలో ఉన్న న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి రూ. 6 లక్షలు పన్ను చెల్లించినా పంచాయతీ అకౌంట్‌కు జమ కాలేదని అధికారులు నిగ్గు తేల్చారు. నిధుల దుర్వినియోగంలో పంచాయతీ అధికారుల పాత్ర కూడా ఉండడంతో తమను కాపాడాలని ఉన్నతాధికారుల వద్ద లాబీయింగ్‌కు దిగినట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్యాలయ అధికారులు సర్పంచ్ కృష్ణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు అప్రమత్తమై సర్పంచ్ కృష్ణ చెక్‌పవర్ రద్దు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు రెండు దఫాలుగా నోటీసులు ఇచ్చినా సర్పంచ్ నోముల కృష్ణ నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమయ్యారు.

ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటాం : ఎంపీడీవో

కొప్పునూరు సర్పంచ్ నోముల కృష్ణ నిధులు దుర్వినియోగం అంశం పంచాయతీ శాఖ జిల్లా ఉన్నతాధికారి (డీపీవో) దృష్టిలో ఉందని, చెక్‌పవర్ కూడా నిలిపివేయడం జరిగిందని, త్వరలోనే డీపీవో కొప్పునూరు పంచాయతీని పరిశీలించి చర్యలు తీసుకుంటారన్నారు. ప్రస్తుతానికి కొప్పునూరు పంచాయతీ బాధ్యతలు ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు నిర్వహిస్తున్నారని ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ తెలిపారు.

బాపట్ల శిక్షణా కేంద్రానికి ఇద్దరు ఎంపీడీవోల బదిలీ

గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఎంపీడీవోలను బాపట్ల మానవ వనరుల శిక్షణా కేంద్రానికి గజిటెడ్ ఫ్యాకల్టీగా బదిలీ చేశారు. పెదకూరపాడు ఎంపీడీవో పీ రామకృష్ణ, చేబ్రోలు ఎంపీడీవో కే లలితను బాపట్ల శిక్షణా కేంద్రానికి బదిలీ చేయాలని పీఆర్ కమిషనర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వారిని విధుల నుంచి రిలీవ్ చేస్తూ జడ్పీ సీఈవో జ్యోతి బసు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు.

14 నెలలుగా జీతాలు అందక అవస్థలు

జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదన

గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆకలితో అలమటిస్తున్నారు. గడచిన 14 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. జిల్లా పరిషత్‌లో ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్‌లోని ఇప్పటి పాలక వర్గం మొట్టమొదటి సమావేశంలో అనుమతి పొందిన తరువాత వారిని విధుల్లోకి తీసుకున్నారు. విధుల్లో చేరిన తర్వాత నెలకు రూ. 15000 చొప్పున జీతాలు చెల్లించారు. డిప్యూటీ సీఈవో మోహన్‌రావు ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారికి జీతాల చెల్లింపులు నిలిపివేశారు. జీతాల చెల్లింపు కోసం పాలకవర్గం రూ.14 లక్షలు కేటాయించినా అధికారులు మాత్రం కనికరం చూపడం లేదన్న వాదన వినిపిస్తోంది. పెండింగ్ జీతాలు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యుత్ వాహన వినియోగం పెరగాలి

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు విద్యుత్ ఆధారిత వాహనాల వినియోగం పెరగాలని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు

ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీ అనే అంశంపై రెండు రోజుల యూజీసీ జాతీయ వర్క్ షాప్ సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్‌కు వచ్చే విషవాయువులు ప్రజారోగ్యంపై దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావం చూపిస్తాయన్నారు. భవిష్యత్తు అంతా ఎలక్ట్రికల్ వాహన వినియోగంపై దృష్టి సారిస్తారని పేర్కొన్నారు. బీజేపీ విద్యుత్ శాఖ ఓఎస్డీ ఏవీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యుత్ వాహన టెక్నాలజీలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. టెక్నికల్ మేనేజర్ మంజునాథ కులకర్ణి మాట్లాడుతూ డిజైన్ మోడల్ విద్యుత్ వాహనాలు మోటార్ సెలక్షన్ టార్క్ క్యాలిక్యులేషన్స్ అనే అంశాలను వివరించారు. అనంతరం వర్క్ షాపు డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల్లో ముఖ్యమైనది బ్యాటరీ టెక్నాలజీస్ అన్నారు. ఫాస్ట్ ఛార్జింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య కృష్ణ సత్య, ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం గోపీకృష్ణ, డాక్టర్ డీ చంద్రమౌళి, విభాగం కోఆర్డినేటర్ ఎం వీ ఉమామహేశ్వరి, ఆర్ఎస్ శ్రీనివాస్, ఏడీ రాజాజీ, డాక్టర్ సీహెచ్ పుణ్యశేఖర్, కోటిరెడ్డి, విభాగం టెక్నీషియన్స్ ప్రసాద్, అజయ్ బాబు, మనోహర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్లీ.. హ్యాపీనెస్ట్

(5వ పేజీ తరువాయి)

నేలపాడు వద్ద ఓవైపు ఎన్-12, ఎన్-13ల మధ్య ఇంకోవైపు ఈ-7, ఈ-8ల మధ్య రహదారుల వెంబడి 14.46 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టింది. మొత్తం 1200 ఫ్లాట్లు.. 12 టవర్లను 2బీ+జీ+18 అంతస్తులుగా నిర్మించాలని ప్రతిపాదించింది. అప్పట్లో ప్రాజెక్టు మొత్తం ఖర్చును రూ.714 కోట్లుగా అంచనా వేసి నిర్మాణ పనులను షాపూజీ పల్లోంజీ సంస్థకు అప్పగించింది. చదరపు గజం ధరను రూ.4049 వంతున నిర్ణయిస్తూ ప్రాజెక్టును ప్రకటించగా.. జనం ఎగబడి ఇంచుమించుగా 1185 మంది ఫ్లాట్లను బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో ప్రాజెక్టు పనులు కేవలం పైల్స్ టెస్టింగ్ వరకు మాత్రమే పరిమితమయ్యాయి. దీంతో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారంతా గగ్గోలు పెట్టారు. వీరిలో సుమారు వంద మంది కావాలని కోరడంతో రూ.25 కోట్ల మేర అడ్వాన్స్‌లను ఇచ్చేశారు. బుక్ కాని 15 ఫ్లాట్లతో పాటు వంద మంది నగదు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం 115కు పైగా ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే బుక్ అయిన ఫ్లాట్లను మినహాయించి ఖాళీగా ఉన్న ఫ్లాట్‌లను కొత్తగా బుక్ చేసుకునేవారికి మాత్రం పెరిగిన నిర్మాణ వ్యయాన్ని బట్టి ఎస్ఎఫ్‌టీ రేట్లను నిర్ణయిస్తారు. పాతవారి నుంచి మాత్రం అదనంగా పైసా కూడా వసూలు చేయరు. ప్రస్తుతం ప్రాజెక్టు స్థలంలో నెలరోజులుగా నీటి తోడివేత పనులు చేపట్టి జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు రెండేళ్లకు పైబడి సాగనుండడంతో ఆ ప్రాంగణంలోనే కార్మికులు నివాసం ఉండేందుకు వీలుగా


నేలపాడు వద్ద ఏడీసీఎల్ నిర్మిస్తున్న హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు తాలూకు గ్రౌండు

తాత్కాలిక షెడ్లను కూడా నిర్మించారు. భవన నిర్మాణపనులను ఆరంభించేందుకు ముందస్తు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు.

రెండేళ్లలో పనులు పూర్తి..

ఈ ప్రాజెక్టులో 1225, 2750 చదరపు అడుగుల విస్తీర్ణం కల ఫ్లాట్లు ఉన్నాయి. ఇందులో 144 ఫ్లాట్లు డబుల్ బెడ్ రూమ్‌వి కాగా, 1036 త్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లుగా ఉంటాయి. మొత్తం విస్తీర్ణంలో అత్యధిక భాగం ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రోడ్ల కోసమే వినియోగించేలా ప్రణాళికను రూపొందించారు. ఒక్కో అంతస్తులో రెండేసి పార్కింగ్ ఫ్లోర్‌లకు స్థానం కల్పించి మొత్తం 12 టవర్లలో కలిపి 1631 కార్లు, 1200 బైకులను పార్కింగ్ చేసుకునేలా వెసులుబాటును కల్పిస్తున్నారు. ఇవిగాక మరో రెండు ఎమినిటీస్ బ్లాకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

అవినీతి చేయకపోతే డబ్బులు వెనక్కి ఎందుకు ఇస్తున్నారు

మాజీ మంత్రి రజినికి ప్రత్తిపాటి సూటి ప్రశ్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట,మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఏ తప్పుచేయకపోతే, అవినీతికి పాల్పడకపోతే దోచిన డబ్బులు ఎందుకు వెనక్కు ఇస్తున్నారో, క్రషర్ వారితో రాయబారాలు ఎందుకు చేశారో చెప్పాలని స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాజీ మంత్రి రజినీని ఉద్దేశించి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో పుల్లారావు మాట్లాడు తూ తనవద్దకే మనుషుల్ని రాయబారానికి పంపారని స్వయంగా ఎంపీ కృష్ణదేవరాయులు చెప్పలేదా, చేసిన తప్పులకు ఎంతటివారైనా మూల్యం చెల్లించుకోవాల్సిందేనని, చట్టప్రకారం శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. పసుమర్రు జగనన్న కాలనీ భూసేకరణ విషయంలో డబ్బులు గుంజి కేసుల భయంతో తిరిగి రైతులకు వెనక్కు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే అని అన్నారు. అవినీతి మంత్రిగా ముద్ర వేయించుకుని, ఇప్పుడు తప్పుచేయలేదంటే ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి నిజాయితీపరుడైన ఎంపీపై కూడా నిందలు వేసే స్థాయికి వచ్చారన్నారు. ఆమె అవినీతిపై సొంతపార్టీవారే హైకోర్టుకు వెళ్ళిన విషయం అందరికీ తెలిసినదేనన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి సోమేపల్లి సాంబయ్య 6 సార్లు, తాను 6 సార్లు పోటీచేశామని, ఎవరైనా, ఎప్పుడైనా సరే, సొంతపార్టీ వారు మాపై హైకోర్టును ఆశ్రయించారా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు రాబట్టే సొంతపార్టీ వారే గత ఎన్నికల్లో గుంటూరుకు పంపించారని అన్నారు. ఆమె చేసిన తప్పులు కడుక్కోవడానికి ఆమె జీవితం సరిపోదని, ఆ తప్పులపై సొంతపార్టీవారే తేల్చుకోవడానికి క్యూలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో సోషల్ మీడియా ముసుగులో అసభ్య ప్రచారానికి తెరలేపి, విష ప్రచార సంస్కృతిని తీసుకొచ్చి, చేసిన దుష్ప్రచారాన్ని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదని అన్నారు. చేసిన అవినీతిని రూపాయితో సహా కక్కించేవరకు కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదని చెప్పారు. ఐ-టీడీపీ కోఆర్డినేటర్ పిల్లికోటి వ్యవహారంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చంద్రబాబు ఏనాడో చెప్పారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

ఎన్ఎస్‌పీ డిప్యూటీ సీఈగా

రాధాకృష్ణ బాధ్యతల స్వీకారం



గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా వీ రాధాకృష్ణ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఉదయం గుంటూరులోని ఎన్ఎస్‌పీ చీఫ్ ఇంజనీర్ కార్యాలయానికి వచ్చిన ఆయన డిప్యూటీ సీఈగా చార్జ్ తీసుకొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన రాధాకృష్ణ 1992వ సంవత్సరంలో అసిస్టెంట్ ఇంజనీర్ హోదాలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో చేరారు. అక్కడ దీర్ఘకాలం విధులు నిర్వహించిన తర్వాత అన్నమయ్య, కడప వెలిగళ్ల ప్రాజెక్టుల్లో డీఈఈగా విధులు నిర్వహించారు. ఆ తర్వాత కర్నూలు ఎస్ఆర్‌బీసీలో విధులు నిర్వహించారు. ఇటీవలే ఆయన్ని ఈఈ క్యాడర్‌లో ఎన్ఎస్‌పీ సీఈగా ప్రభుత్వం బదిలీ చేయడంతో సోమవారం ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తమ పరిధిలో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

నిదానంపాటి అమ్మవారి

జాతర ఆదాయం రూ. 38,62,340

దుర్గి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగొప్పులలో వేంచేసియున్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి వివిధ రూపేణా సమర్పించిన కానుకలను సోమవారం ఆలయంలో లెక్కించగా రూ. 38,62,340లు ఆదాయం సమకూరింది. వివిధ రకాల సేవల ద్వారా రూ. 11,34,439, హుండీ ద్వారా


అమ్మవారి జాతర ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

రూ. 27,27,901లు ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఈవో సైదమ్మబాయి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ. 9,05,532ల ఆదాయం ఎక్కువగా సమకూరిందన్నారు.

వివాహిత హత్య

వివాహేతర సంబంధమే కారణమా?

పిడుగురాళ్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత హత్య జరిగిన సంఘటన పిడుగురాళ్ల పట్టణంలో సోమవారం తెల్లవారుజామున వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... జానపాడు గ్రామానికి చెందిన తాటి కొండలు, ఆదిలక్ష్మి దంపతులు పిడుగురాళ్ల పట్టణంలో సున్నపు బట్టీలలో కార్మికులుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బట్టీలో మేస్త్రీగా పని చేసే ఏడుకొండలుతో ఆదిలక్ష్మికి పరిచయం ఏర్పడింది. దీంతో భర్త కొండలను వదిలేసి ఏడుకొండలతో ఐదు సంవత్సరాలుగా తనకు ఉన్న ఇద్దరు పిల్లలలో పిడుగురాళ్ల పట్టణంలోని మారుతీ నగర్‌లో నివాసం ఉంటుంది. సోమవారం తెల్లవారుజామున ఏడుకొండలు బట్టీ పనికి వెళ్లగా.. రోజు మాదిరిగానే పిల్లలు అమ్మమ్మ పార్వతమ్మ వద్ద నిద్రించి తిరిగి ఉదయాన్నే ఇంటికి రాగానే రక్తం కనిపించటం, ఇంట్లో అమ్మ కనిపించకపోవటంతో అమ్మమ్మకు, బంధువులకు, స్థానికులకు సమాచారం అందజేశారు. బంధువులు, స్థానికులు విషయం వెంటనే పోలీసులకు తెలియజేయటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ మొదలు పెట్టారు. అయితే దారిపొడవునా రక్తపు మరకలు ఉండటంతో ఆ రక్తపు మరకలను ఫాలో అవుతూ పోలీసులు వెళ్లారు. మారుతీ నగర్‌కు దూరంగా నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న క్వారీ గుంత వద్ద రక్తపు మరకలు, ఆదిలక్ష్మికి సంబంధించిన తాలిబొట్టు కనిపిం చింది. వెంటనే పోలీసులు క్వారీ గుంతలో వెతకగా ఆదిలక్ష్మి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంటనే ఏడుకొండలను విచారించగా అతను తడబడుతుండటంతో పోలీసులు ఏడుకొండలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆదిలక్ష్మి (ఫైల్)

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ కే శ్రీనివాసరావు

మారుతీనగర్ ప్రాంతంలో సోమవారం ఉదయం జరిగిన ఆదిలక్ష్మి హత్య ప్రదేశాన్ని సోమవారం రాత్రి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సందర్శించారు. సమీపంలో నివసిస్తున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన యడ్లపాడు మండలం బోయపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివారాల ప్రకారం.. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన భార్గవి(25)కి యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన వడ్డేపల్లి అశోక్‌తో ఏడేళ్ళ క్రితం వివాహం జరిగింది. అశోక్ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుండగా భార్గవి కూలి పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటుంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భార్గవి గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. విషయం తల్లి దుర్గకు తెలుపగా ఉప్పలపాడు ఆర్ఎంపీ వైద్యునితో వైద్యం చేయించి భర్తవద్దకు పంపించింది. అయితే కడుపు నొప్పి తగ్గకపోవడంతో తల్లికి ఫోన్‌చేసి నొప్పి భరించలేకున్నాను చనిపోవాలని ఉందంటూ పలు మార్లు చెప్పింది. ఆదివారం సాయంత్రం మరోసారి తీవ్రంగా నొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గ్రామానికి చేరుకుని కుమార్తెను చూసి భోరున విలపించారు. మృతురాలి తల్లి దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

యడ్లపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో 16వ నంబరు జాతీయరహదారి కొత్త బైపాస్ మార్గంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ కుటుంబం ఏపీ 39 ఎస్‌డబ్ల్యూ 1414 నంబరు గల స్కార్పియో వాహనంలో ఆదివారం సాయంత్రం ఒంగోలు వైపు బయలు దేరారు. సుమారు రాత్రి 8.30గంటల సమయంలో తిమ్మాపురం వద్ద కొత్త బైపాస్ మార్గంలోని బ్రిడ్జిపైకి వీరి కారు చేరుకుంది. ఆ సమయంలో గుంటూరు నుంచి కనిగిరికి గృహోపకరణాలు తీసుకుని వెళుతున్న ఏపీ 39 డబ్ల్యూసీ 8067 నంబరు గల టాటా ఏస్ మినీ ట్రాన్స్‌పోర్ట్ వాహనం వేగంగా వస్తూ అదుపు తప్పి స్కార్పియోను వెనుక నుంచి ఢీకొట్టింది. దీనితో స్కార్పియో వాహన యజమానికి మినీ ట్రాన్స్‌పోర్టు వాహనం డ్రైవర్ బత్తుల వెంగయ్య(30)ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వాగ్వాదం మధ్యలో ఒంగోలు సమీపంలోని స్వగ్రామమైన ఎస్ గూడెపల్లెలోని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి ప్రమాదం గురించి సమాచారం ఇచ్చాడు. అనంతరం నడ్డిరోడ్డుపై నిలిపి ఉంచిన వాహనం వద్దకు పరుగు తీశాడు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు వెంగయ్యను ఢీకొట్టింది. వెంగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనపై తల్లి వీరమ్మ సోమవారం యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మృతదేహానికి చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.

బైకును టాటా మ్యాక్సీ ఢీకొని ఒకరి మృతి


అశోక్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

వెల్దుర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బైకును టాటా మ్యాక్సీ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని శిరిగిరిపాడులో చోటుచేసుకుంది. శిరిగిరిపాడు గ్రామానికి చెందిన ఈదర అశోక్‌రెడ్డి (29), బోయ వెంకటరెడ్డిలు సోమవారం ద్విచక్ర వాహనంపై పొలం నుంచి ఇంటికి వస్తున్నారు. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే వెనుకగా వచ్చిన టాటామ్యాక్సీ వాహనం బైకును ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలపాలైన అశోక్‌రెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకటరెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచికల్లు రిజర్వాయర్‌లో మృతదేహం లభ్యం

రహదారి పనులకెళ్లి శవమై తేలాడు...!


తురకా కోటేశ్వరరావు(ఫైల్)

రెంటచింతల,మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కూలీ పనులకెళ్లి సాగర్ కాలువలో జారిపడిన యువకుడు మృతదేహం సోమవారం మంచికల్లు రిజర్వాయర్‌లో లభ్యమైంది. సేకరించిన వివరాలిలా వున్నాయి. మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన తురకా శ్రీను,నాగలక్ష్మిల ఏకైక కుమారుడు కోటేశ్వరరావు గురజాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి శనివారం జాతీయ రహదారి పనులకెళ్ళాడు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కూలీలతో కలిసి పనిచేసిన తరువాత ట్యాంకర్‌లో నీటిని నింపే క్రమంలో కాలుజారి బొంబాయి బ్రిడ్జి కుడి కాలువలో పడిపోయాడు. సోమవారం బుగ్గవాగు రిజర్వాయర్‌లో శవమై తేలాడు.

కొలనుకొండ హతురాలు సజ్జా తిరుపతమ్మగా గుర్తింపు


సజ్జా తిరుపతమ్మ (ఫైల్ ఫోటో)

తాడేపల్లి (కొలనుకొండ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం కొలనుకొండ వద్ద హైవేకు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో హత్యకు గురై విగతజీవిగా పడివున్న మహిళను పామర్రుకు చెందిన సజ్జా తిరుపతమ్మ (35) గా పోలీసులు గుర్తించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలని భర్త మృతి చెందడంతో కుటుంబ పోషణ భారమై క్యాటరింగ్ పనులకు వెళుతుందని సీఐ కల్యాణ్‌రాజు తెలిపారు. ఆదివారం ఉదయం విజయవాడలో క్యాటరింగ్ పనులకు వెళుతున్నానని చెప్పి తిరుపతమ్మ ఇంటి నుంచి వచ్చిందని హతురాలి కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. అనంతరం హత్యకు గురైన మహిళ విషయం వెలుగులోకి రావడంతో మృతురాలిని గుర్తించామని చెప్పారు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారని తెలిపారు. కాగా ఈ విషయమై క్లూస్ టీమ్ సోమవారం సంఘటనా స్థలానికి చేరుకుని పలు వివరాలు సేకరించింది. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ తెలిపారు. కాగా ఈ హత్యకు సంబంధించి పలువురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 520.60 అడుగులు ఉంది. ఇది 150.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6870 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 14,711 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	109, 117, 128
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

1,05,783 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,18,783 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,05,783 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,366 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13100
273	--	--
341	10000	14000
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13200

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12000
బ్యాడిగి 355	10000	12700
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10200	12500
ఆర్మూరు	10000	11600
తాలుకాయలు	5000	7200

ప్రతి సమస్యకు పరిష్కారమార్గం చూపాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి ● పీజీఆర్ఎస్‌లో 170 అర్జీలు

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే ఫిర్యాదులలో ప్రతి సమస్యకు పరిష్కారమార్గం చూపాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధప్రాంతాలు నుంచి 170 మంది విచ్చేసి అర్జీలు అందజేశారు. అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ తక్షణమే తన పరిధిలో వాటికి పరిష్కారం చూపారు. కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటికి విచారణకు ఆదేశించారు. తన పరిధిలో లేనివాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని హామినిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతుల సమస్యలు పరిష్కరించాలి : డాక్టర్ కొల్లా



నినాదాలు చేస్తున్న డాక్టర్ రాజమోహన్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్, సభ్యులు

గడిచిన మూడు సంవత్సరాలు బర్లీ పొగాకు రేటు లాభసాటిగా ఉండటంతో సన్న, చిన్నకారు రైతులతో పాటు అనేకమంది రైతులు బర్లీ పొగాకు సాగు విస్తారంగా చేపట్టారని అయితే నేడు గిట్టుబాటు ధర లేకుండా పోయిందని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. బర్లీ పొగాకు సాగు చేసిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నల్లమడ రైతు సంఘం నాయకులు, సభ్యులతో కలిసి ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్ జె.వెంకటమురళికి తమ సమస్యను వివరించారు. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్‌కుమార్, రైతు సంఘం నాయకులు నాయుడు సుబ్బారావు, దొప్పలపూడి హరిబాబు, కె.అరుణకుమార్, దొడ్డిపవన్‌కుమార్, కూసం వెంకటరెడ్డి, అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకుడు మేకలప్రసాద్, బీజేపీ నాయకులు జివిఎల్.మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫీల్డ్ సిబ్బందిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ సిబ్బంది 17 సంవత్సరాల సర్వీస్‌ను పరిగణలోకి తీసుకొని అందరిని ప్రభుత్వ పరిధిలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి డిపివో కేడర్ అమలు చేసి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఫీల్డ్ సిబ్బంది కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిట్టివాద భూములకు సాగునీరందించాలి

చీరాల-పేరాలకు సంబంధించిన చిట్టివాద అయకట్టు రైతులకు సాగునీరు అందించి ఆదుకోవాలని బాధిత రైతులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్ వెంకటమురళికి విజ్ఞప్తి చేశారు. అధికారులు ఇరిగేషన్‌వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని రైతులు బోయనకృష్ణ, మద్దెన సుబ్బారావు, ఎన్.శ్రీను, పి.లాజర్, బోయన రామకృష్ణ, కలగమ్మ, బి.పున్నయ్య కోరారు.

అర్జీలు పునరావృతం కాకుండా చూడాలి

● ఎస్పీ తుషార్ డూడి



బాధిత మహిళ వద్దకు వచ్చి అర్జీ స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల,మార్చి 24(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా వాటికి శాశ్వత పరిష్కారం చూపించాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి 48 మంది వచ్చి వారి సమస్యలను ఎస్పీకి వివరించారు. వారి సమస్యలు తెలుసుకున్న ఎస్పీ అర్జీలను పరిశీలించి సంబంధిత పోలీసుస్టేషన్‌ల అధికారులతో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో నిర్దిష్ట గడువులోగా విచారించి పరిష్కారం చూపాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసు శాఖ భరోసాగా ఉండాలన్నారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగదాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర సమస్యలతో కూడిన అర్జీలు వచ్చాయి. సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై నిఘా : ఎస్పీ

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ తుషార్‌డూడి హెచ్చరించారు. ఈవిషయమై సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రేపల్లె, చీరాల, అద్దంకి, మరికొన్ని ప్రాంతాలలో బెట్టింగ్‌లకు పాల్పడే అవకాశం ఉన్న ముఠాలపై పోలీసు నిఘా కొనసాగుతుందన్నారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన కేసులలో అరెస్టుకాబడిన 39మంది కదలికలు నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడేవారిపై కూడా నిఘా ఉంచామన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడేవారిపై రౌడీషీట్స్ తెరవటానికి కూడా వెనుకాడబోమన్నారు. గతంలో బెట్టింగ్‌కు పాల్పడిన వారిపై బైండోవర్ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఎక్కడైన బెట్టింగ్‌లకు పాల్పడితే 112కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

ఎస్సీ మహిళలకు సబ్సిడీ రుణాలు అందజేత



లబ్ధిదారులకు రుణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కర్లపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి అనుచిత జాతి అభ్యుదయ యోజన పథకాన్ని మహిళా సంఘాలలోని ఎస్సీ కుటుంబాలవారు ఉపయోగించుకోవాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. కర్లపాలెం పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రామ సభలో ఆయన ప్రధానమంత్రి అనుచిత జాతి అభ్యుదయ యోజన పథకం తాలూకా రూ.5 లక్షలను లబ్దిదారులకు పంపిణీ చేశారు. రూ.లక్ష రుణంలో రూ.50 వేలు సబ్సిడీ, రూ.40 వేలు రాష్ట్రీయ పేదరిక నిర్మూలన సంస్థ నుంచి రుణం, రూ.10 వేలు లబ్ధిదారులకు మార్జిన్ మనీగా పథకం అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ నక్కా లలితకుమారి, ఉపసర్పంచ్ పఠాన్ అహ్మద్‌బాషా, ఏపూరి భూపతిరావు, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, నాయకులు నక్కల వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి సునీత, పిట్ల వసంతరెడ్డి, మునిపల్లి చిన్న, షేక్ బాజి, చిలకల సురేంద్ర, సీసీలు శివకోటేశ్వరరావు, రాఘవ, వీవోలు షాలిని, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుకు నీటి కొరత ప్రాంతాలు అనుకూలం

బాపట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : నీటికొరత ఉన్న ప్రాంతాలు చిరుధాన్యాల సాగుకు అనుకూలమని ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో జన్యుశాస్త్ర, వృక్షప్రజనన విభాగం ఆధ్వర్యంలో సేంద్రియ చిరుధాన్యాలసాగు, సస్యరక్షణ, ఆరోగ్యప్రయోజనాలు విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్యుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ లాల్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారికి చిరుధాన్యాలు ఎంతో ఉపయోగమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వినయ్‌కుమార్, డాక్టర్ ఎన్.కిరణ్‌కుమార్, డాక్టర్ టి.తుషార తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

బాపట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వివిధ పథకాలను ప్రవేశపెట్టి అన్నదాతకు అండగా నిలుస్తుందని సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఆర్థికశాస్త్ర విభాగంచే నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ విధానాలపై స్పష్టమైన అవగాహన కలిగియుండాలన్నారు. మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు మార్క్‌ఫెడ్ రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనారాణి, ప్రొఫెసర్లు డాక్టర్ కేఎస్ పాల్, డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ కె.సుశీల, డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ వి.సీతారాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

26న బీసీ, ఈబీసీ, కాపు లబ్ధిదారులకు రుణ మేళా

పిట్టలవానిపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 26న స్వయం ఉపాధిలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించేందుకు శిబిరం జరుగుతుందని ఎంపీడీవో ఐ.సత్యనారాయణరావు సోమవారం తెలిపారు. మండలపరిధిలోని బ్యాంక్ అధికారులు, బ్యాంక్ మేనేజర్లు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రతివార్డులో పర్యటిస్తా.. ప్రతి సమస్యను పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
● రైలుపేటలో మనవార్డు...మన ఎమ్మెల్యే



5వవార్డులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మనవార్డు-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రతి వార్డును సందర్శించి సమస్యలకు పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. పట్టణంలోని 5వ వార్డు రైలుపేటలో సోమవారం ఆయన మున్సిపల్ అధికారులు, పార్టీశ్రేణులతో కలిసి పర్యటించారు. ప్రతి ఇంటికెళ్ళి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారానికి ఒక వార్డు, ఒక గ్రామాన్ని అన్నిశాఖల అధికారులతో సందర్శించి సమస్యలు తెలుసుకుంటామన్నారు. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, పెద్ద సమస్యలు త్వరితగతిన పరిష్కరించేదిశగా పనిచేస్తామన్నారు. ప్రతి బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలను పరిష్కారిస్తామని చెప్పారు.

సమస్యలు ఇవి

రైలుపేటలో పర్యటించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వార్డు ప్రజలు ఆయన దృష్టికి అనేక సమస్యలు తీసుకొచ్చారు. వర్షాకాలం వస్తే రోడ్లపై నీరు నిలిచి ఇబ్బంది పడుతున్నామని కఠారి శ్రీనివాసరావు, వీరమ్మ చెప్పారు. పరిశీలించిన ఎమ్మెల్యే రోడ్డుకు డ్రైనేజికి మధ్య ఉన్న ఇసుకమెటలను పూర్తిగా తీసివేసి డ్రైనేజిలోని సిల్ట్ తొలిగించి మురుగు సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తాగునీరు సక్రమంగా సరఫరా కావటంలేదని కొమ్మినేని వీరయ్యచౌదరి ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై అధికారులు తగుచర్యలు తీసుకోవాలని కమిషనర్ జి.రఘునాథరెడ్డిని ఆదేశించారు. నిరుపేద కుటుంబానికి చెందిన కొత్త గొర్ల నాగరత్నమ్మ తాగునీటి పైపులైన్ వేయించాలని విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పందించి కుళాయి ఏర్పాటుకు అయ్యే ఖర్చు మున్సిపాలిటికి చెల్లించి వెంటనే కనెక్షన్ ఇప్పించారు. అదేవిధంగా పెన్షన్ లేక ఇబ్బంది పడుతున్నామని అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఎమ్మెల్యేకు తెలపగా వెంటనే ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, పరిశా రమేష్‌గౌడ్, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, కూచిపూడి ఝాన్సీరాణి, దగ్గుమల్లి రాణి, నజ్మా, జి.గిరిజారాణి, కూచిపూడి శ్యామ్ సుందర్, టీపీవో మల్లికార్జునరావు, ఏఈ ప్రసాద్, మెప్మా సీఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, ఆర్‌వో జబ్బార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్లను దోమల రహిత పట్టణంగా చేస్తాం

బాపట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : దోమల రహిత పట్టణంగా బాపట్లను తీర్చుదిద్దుతామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. పురపాలక సంఘానికి కొనుగోలు చేసి తెచ్చిన బుల్‌డోజర్, మూడుట్రాక్టర్‌లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహితబాపట్లగా తయారు చేసుకోవటానికి ఎంతో కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వ్యాపారం చేసే వ్యాపారస్తులు విక్రయాలు జరిపితే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, కూచిపూడి శ్యామ్‌సుందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక ఏకపాత్ర పోటీలలో బాపట్ల కళాకారుడి ప్రతిభ

బాపట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో పౌరాణిక ఏకపాత్ర పోటీలు శ్రీసీతారామాంజనేయ కళాపరిషత్, మార్టూరుపేట, మధిర, ఖమ్మం జిల్లా వారు నిర్వహించారు. ఈనెల 21, 22, 23 తేదీలలో నిర్వహించిన ఈ పోటీలలో బాపట్ల మండలం ఆదర్శనగర్‌కు చెందిన సంగాని ఏడుకొండలు పల్నాటి యుద్ధం నుంచి బాలచంద్రుడు ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. దీంతో నిర్వాహకులు ఆయనకు బహుమతి, ప్రశంసపత్రాన్ని అందజేశారు. శ్రీవిఘ్నేశ్వర నవినాటక కళాసమితి అధ్యక్షుడు సోమరాజు శ్రీనివాస్, సీనియర్ రంగస్థలనటుడు జి.మల్లికార్జునశర్మ ఆయనను అభినందించి మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదికను ఉపయోగించుకోవాలి

కర్లపాలెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల ప్రజలు, రైతాంగం ఉపయోగించుకోవాలని కర్లపాలెం తహసీల్దార్ సుందరమ్మ అన్నారు. కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని పలుశాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, ఎంఈవో మనోరంజని, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

కార్మికులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : దుకాణాలు, సంస్థలలో పని చేస్తున్న కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు వేసవి దృష్ట్యా ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని జిల్లా కార్మిక శాఖాధికారి డీవీ శివప్రసాద్ తెలిపారు. ఈ విషయమై సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల రక్షణకు యాజమాన్యం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పనిసరిగా నిబంధనలు పాటిచాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాయిజ్యోతి తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవోకు వినతి

భట్టిప్రోలు, (కొల్లూరు) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో ఎస్.వెంకటరమణకు సీపీఎం నాయకులు వినతి పత్రం అందించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీపీఎం నాయకులు ఎంపీడీవోను కలిసి ప్రజా చైతన్య యాత్రలో భాగంగా భట్టిప్రోలు, ఐలవరం, వెల్లటూరు, పెదపులివర్రు, పెసర్లంక తదితర గ్రామాల్లో పర్యటించామని ప్రజలు పలు సమస్యలను బృంద సభ్యుల ముందు ఏకరువు పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.కృష్ణమోహన్, మండల కార్యదర్శి సుధాకర్, వి.మనోజ్‌కుమార్, ఎం.సత్యనారాయణ, నాగరాజు, డి.సత్యనారాయణ, బసవయ్య పాల్గొన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయాలి

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 1వ తేదీన చినగంజాం మండలం చిన్నగొల్లపాలెం గ్రామంలో పెన్షన్ల పంపిణి కార్యక్రమానికి విచ్చేస్తున్నారని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈవిషయమై సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పేదల సేవలో ఫించన్ పంపిణి పేరిట నిర్వహించే ఈ కార్యక్రమంలో వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులైన లబ్ధిదారులతో మాట్లాడి వారికి పించన్‌లు పంపిణి చేస్తారన్నారు. సభ పూర్తికాగానే గంటపాటు పార్టీకార్యకర్తలతో సమావేశం అవుతారన్నారు. తదుపరి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. హెలీప్యాడ్ ప్రాంతం, ఫించన్‌పంపిణి చేసే లబ్దిదారుల నివాసం ప్రాంతం, సభావేదిక, కార్యకర్తల సమావేశం, అధికారుల సమావేశ వేదికలను పరిశీలించాలన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

మహిళలు, చిన్నారుల రక్షణకు చర్యలు

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన చిన్నపిల్లలకు తల్లులు పాలిచ్చు గదిని కలెక్టర్ జె.వెంకటమురళి సోమవారం ప్రారంభించారు. ఏదైన పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే మహిళలకు ఇది ఎంతో సౌకర్యంగా ఉంటుందని కలెక్టర్ చెప్పారు. మహిళలు, చిన్నారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు, ఇతర పని ప్రాంతాలలోను ఇలాంటి గదులు ఏర్పాటు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ డి.రాధామాధవి, జిల్లా వ్యవసాయాధికారి కె.రామకృష్ణ, డీసీపీవో పురుషోత్తం, సీడీపీవోలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చంద్రబాబు, మందకృష్ణ ఫొటోలకు పాలాభిషేకం

వేమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ద్వారా చర్యలు తీసుకున్నందుకు వేమూరు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మందకృష్ణ మాదిగల ఫొటోలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు ఆరమళ్ల దేవ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ ఉపకులాలకు రాబోయే రోజుల్లో మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పచ్చిగళ్ల అనిల్, వినయ్, కొండ మునియ్య, కళ్యాణ్ పాల్గొన్నారు.

మోసపోయిన డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి

రేపల్లె, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : మెప్మా సిబ్బంది అవినీతి, దోపిడీ వల్ల మోసపోయిన డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 21వ వార్డు పరిధిలో డ్వాక్రా గ్రూపుల్లో అవినీతికి పాల్పడిన మెప్మా సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పట్టణంలో కలుషితం లేని తాగునీరు ఉదయం, సాయంత్రం అందించాలని కోరారు. 19, 20, 15 వార్డుల్లో ఉమ్మడిగా ఉపయోగించుకుంటున్న దళితుల శ్మశాన స్థలానికి అదనంగా ఐదు ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కేవీ లక్ష్మణ్‌రావు, కె.ఆశీర్వాదం, డి.ఆగస్టీన్, కె.రమేష్, వై.నవీన్, జే.ధర్మరాజు, డి.శ్రీనివాసరావు, కె.నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

సహాయక ఉపకరణాల పంపిణీకి దివ్యాంగుల సర్వే

చెరుకుపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సహాయక ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులను గుర్తించే సర్వే ఈనెల 24వ తేదీ నుంచి సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్స్ చేస్తున్నారని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. సహాయక ఉపకరణాలు అవసరమైన దివ్యాంగులు లేదా వారి కుటుంబ సభ్యులు వారి సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌ని కలిసి ఈనెల 26వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు. అర్హత కలిగిన దివ్యాంగులకి మూడు చక్రాల సైకిల్, వీల్‌చైర్, చంకకర్రలు, బ్రైలీపలక, అంధుల చేతికర్ర, వినికిడి యంత్రాలు వంటి వివిధ సహాయక ఉపకరణాలు అందిస్తారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విద్యుత్ మరమ్మతులు అభివృద్ధి కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ఎ.శివనాగిరెడ్డి తెలిపారు. పట్టణంలోని నిజాంపట్నం రోడ్డు, ఇసుకపల్లి నుంచి ఉప్పూడి రోడ్డు వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లెక్కల పరీక్షకు ఆరుగురు గైర్హాజరు

వేమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమూరు, పెరవలి పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పది పరీక్షలకు సోమవారం లెక్కల పరీక్షకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. వేమూరు పరీక్ష కేంద్రంలో 161 మంది విద్యార్థులకు గాను 155 మంది హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పెరవలి కేంద్రంలో 65 మందికి గాను 65 మంది హాజరయ్యారు.

పర్యావరణాన్ని పెంపొందించుకోవాలి

వేమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని తహసీల్దార్ సుశీల అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గంగోత్రి వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పాముల అనిల్ సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ సుశీల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు గంగోత్రి యాజమాన్యం అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రదర్శన

వేమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వేమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ నివాసితులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం నాయకుడు బి.అగస్టీన్ మాట్లాడుతూ, అంబేద్కర్‌నగర్ కాలనీలో తాగునీరు, రోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ పంచాయతీ కార్యదర్శి భూపతిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాలిగ నాంచారమ్మ, లక్ష్మీతిరుపతమ్మ, నవ్య, ప్రావీణ్య, బొద్దు నాగమల్లేశ్వరి, దాసరి సుందరమ్మ పాల్గొన్నారు.

జొన్న, మొక్కజొన్న పంటల సాగుపై రైతులకు శిక్షణ

భట్టిప్రోలు, (కొల్లూరు) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జొన్న, మొక్కజొన్న పంటల సాగుపై రైతులకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని ఓలేరులో సోమవారం బాపట్ల ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణలో శాస్త్రవేత్త ఎం.ఉష పాల్గొని జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగు విధానాలను వివరించారు. ఎరువుల యాజమాన్యం, కత్తెర పురుగు నివారణ, సస్యరక్షణ పద్ధతులను వివరించారు. డీఆర్‌సీ ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి, చిరుధాన్యాల సాగు, పెరటి తోటల పెంపకం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారావు, పరుచూరి రమేష్, సిబ్బంది జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

30న పంచాంగ శ్రవణం

కొల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీన పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు పార్వతీ అమ్మవారి దేవస్థాన కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవసు నామ సంవత్సర ప్రారంభం సందర్భంగా అప్పాజోస్యుల దక్షిణామూర్తి శర్మ పంచాంగ శ్రవణం చేయనున్నారని సభ్యులు తెలిపారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు అమ్మవారి పుట్టినరోజు పురస్కరించుకుని వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లెవెల్ క్రాసింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

● రైల్వే అధికారులను కోరిన ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



రైల్వే సీనియర్ అధికారులతో సమావేశమైన ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల,మార్చి 24(ఆంధ్రజ్యోతి) : బాపట్ల పార్లమెంట్ పరిధిలోని లెవెల్‌క్రాసింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులను ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. ఈవిషయమై సౌత్ సెంట్రల్ రైల్వే సీనియర్ అధికారులతో సోమవారం ఎంపీ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో 62 లెవెల్ క్రాసింగ్ పనులపై చర్చించారు. నిర్మాణంలో ఉన్న రోడ్డు, ఓవర్‌బ్రిడ్జిలు, రోడ్డు అండర్ బ్రిడ్జిలు, లెవెల్ క్రాసింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో రూ.260 కోట్లతో చేపట్టిన వివిధ పనులు, 5 రోడ్డు ఓవర్‌బ్రిడ్జిలు, విజయవాడ-గూడూరు మధ్యలో ఉన్న ఎల్‌సి 270 తాళ్ళపాలెంరోడ్డు, ఎల్‌సి 272 అరమండలఫీల్డ్‌రోడ్డు, ఎల్‌సి 275 మోతుకూరురోడ్డు, ఎల్‌సి 278 తెనాలిరోడ్డు, 281 చుండూరు-తెనాలి రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ-గుడూరు మధ్య 30 లెవెల్ క్రాసింగ్ పనులను ఆర్‌విఎన్ఎల్ చేపట్టిందని, 5 లెవెల్‌క్రాసింగ్ పనులను రైల్వేబోర్డు తొలిగించిందని, 27లెవెల్ క్రాసింగ్ పనులకు డీపీఆర్ రైల్వే అధికారులు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏకే సిన్హా పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడిపర్రు గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన దొడ్డా రూతమ్మకు రూ.47,483, అమెరె అరుణకు రూ.43,836 చెక్కులను పంపిణీ చేశారు.

క్షయవ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలి : డీఎంహెచ్‌వో



పట్టణంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించి పాతబస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సభలో బెస్ట్ ఎంప్లాయిస్ కింద ఎంపికైన ఆరోగ్యసిబ్బందికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషిన్ ఆహార ప్యాకెట్‌లు పంపిణి చేశారు. కార్యక్రమంలో డీఎల్‌టీవో అధికారి మహమ్మద్ సాధిక్, పేర్లి సునీల్‌కుమార్, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమూరులో ర్యాలీ...

వేమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పూర్వ కాలంలో క్షయ వ్యాధి సోకితే ఆ వ్యక్తి మరణించేవాడని, ఈనాడు శాస్త్రీయ పరిజ్ఞానం పెరగడంతో వ్యాధిని సంపూర్ణంగా నివారించే చికిత్సలు ప్రజల దగ్గరకు తీసుకురావడం జరిగిందని వేమూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్ అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం వేమూరులో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సిబ్బందికి క్షయ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా పర్వీన్ మాట్లాడుతూ, వ్యాధి సోకిన వారికి గ్రామ స్థాయి సిబ్బంది ద్వారా స్వయంగా వ్యాధి నివారణ చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫాతిమా, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రవళి, హెడ్ నర్స్ పద్మావతి, ల్యాబ్ అసిస్టెంట్ రమణకుమార్, ఐసీడీసీలు నాగశ్రీ, పేరమ్మ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 27 టీబీ రహిత గ్రామపంచాయతీలు



మహాత్మాగాంధీ సిల్వర్ ప్రతిమను అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో టీబీ రహిత గ్రామాలు 27 ఉన్నట్లు గుర్తించామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. టీబీ రహిత గ్రామపంచాయతీలుగా గుర్తించి వారికి సిల్వర్, బ్రొంజ్ మహాత్మాగాంధీ ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, డీపీవో ప్రభాకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివప్రసాద్ జన్మదిన వేడుకలు



శివప్రసాద్‌ను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రేపల్లె, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి సోదరుడు అన గాని శివప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకుల మధ్య కేక్ కట్‌చేసి మిఠాయిలను పంచిపెట్టారు. శివప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గం నుంచి వేలాదిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చారు. కృష్ణా, పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు కేసన రామకృష్ణగౌడ్, తాతా ఏడుకొండలు, మోర్ల శ్రీనివాసరావు, పడమట వెంకటసుబ్బారావు, కొనకాల రవికిరణ్‌గౌడ్, మల్లాది రామకృష్ణ, మొహమాటం రాధాకృష్ణమూర్తి గజమాల వేసి సత్కరించారు. పుట్టినరోజు సందర్భంగా ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, సీఐ మల్లికార్జునరావు, తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో శోభారాణి, నాలుగు మండలాల వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేపల్లె రామాంజనేయులు, కొలసాని రాము, పంతాని సాయికుమార్, టీడీపీ నాయకులు చింతల సుబ్బారావు, గుర్రం మురహరిరావు, డొక్కు బుజ్జి, షేక్ జమీర్, ల్యాబ్ కిషోర్, లుక్కా గుడారంకయ్య, కొపనాతి రాజశేఖర్, పూషడపు కుమారస్వామి, ఓగిబోయిన వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శివప్రసాద్‌ను గజమాలతో సన్మానిస్తున్న రవికిరణ్ గౌడ్, మల్లాదిరామకృష్ణ

- శాఖమూరులో 300 ఎకరాల్లో ఏర్పాటు
- పార్కు మధ్య భారీ జలాశయం
- చుట్టూ పార్కులు, వినోద కేంద్రాలు
- హైలెట్‌గా వైల్డర్‌నెస్ పార్కు
- ఇప్పటికే ఆరంభమైన పనులు

అమరావతికే ప్రత్యేకాకర్షణ సెంట్రల్ పార్కు



(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

రాజధాని అమరావతిలో ప్రతీ నిర్మాణమూ ఓ ప్రత్యేకతతో కూడుకున్నదే! ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి పట్టుదలతో ఆవిర్భవిస్తున్న అమరావతి నగరం...మరికొద్ది కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్లూగ్రీన్ ఫీల్డ్ నగరంగా రూపుదిద్దుకోనుంది. ఈ నగరంలో ప్రతీది కళాత్మకంగాను పర్యావరణ వ్యూహానికి పునాదిగాను వుండబోతుంది. నగరంలో 60శాతం ప్రాంతం పచ్చదనం, నీటితో ఆక్రమించబడినట్టు కనిపిస్తూ చాల అద్భుతంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ముఖ్యంగా గవర్నమెంట్ కోర్‌గా పిలువబడే ప్రాంతం 5.5 కిలోమీటర్లు / 1 కిలోమీటరు నిడివిలో న్యూయర్క్ సెంట్రల్ పార్కు స్ఫూర్తిగా దర్శనమివ్వబోతుంది. సరిగ్గా ఈ ప్రభుత్వ భవనసముదాయ ప్రాంగణానికి దిగువగా కనిపించే ప్రాంతంలో రాజధానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా సెంట్రల్ పార్కు నిర్మాణాన్ని చేపడుతున్నారు. నిజానికి అమరావతిలో దీనిని ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుగా భావిస్తున్నారు. ఈ పార్కు నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతున్న ఈ పార్కు రాజధాని అమరావతికే కాదు...దక్షిణ భారతదేశంలోనే ఓ గొప్ప పర్యాటకకేంద్రంగా రూపుదిద్దుకోబోతుంది.


అమరావతి డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ సెంట్రల్ పార్కును నిర్మిస్తున్నారు. ఇది రాజధాని ఏరియాలోని ప్రభుత్వ భవన సముదాయానికి దిగువన అంటే శాఖమూరు పరిధిలో ఏర్పాటవుతోంది. మొత్తం 300 ఎకరాలకు గాను మధ్యలో 50.69 ఎకరాల విస్తీర్ణంలో ఓ సుందరమైన జలాశయాన్ని ఏర్పాటుచేస్తున్నారు. ఈ జలాశయం పనులు ఇప్పటికే మొదలయ్యాయి. అనంతరవం కొండల నుంచి వచ్చే వరదజలాలను ఈ జలాశయానికి మళ్లిస్తారు. అంటే ఈ జలాశయాన్ని వరద నివారణ చర్యలతోపాటు ఆహ్లాదకరంగాను, పర్యాటకంగాను వుండేలా వినియోగించుకోబోతున్నారన్నమాట! .మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యాక ఈ జలాశయంలో బోటింగ్‌కు కూడ అనుమతిస్తారు. ఇందుకోసం జలాశయానికి ఓవైపుగా ఎకరం విస్తీర్ణంలో బోటింగ్ అండ్ వాటర్ స్పోర్ట్స్ జోన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ఈ జలాశయం చుట్టూ సందర్శకులను ఆకట్టుకునేలా వేర్వేరు సాంస్కృతిక, పర్యాటక ఆహ్లాదకర కేంద్రాలను విభిన్నంగా ఏర్పాటు చేస్తారు. జలాశయానికి ఉత్తరంగా పుష్పక్ పేరుతో 23 ఎకరాల విస్తీర్ణంలో ఫ్లవర్ గార్డెన్‌ను ఏర్పాటుచేస్తారు. దీని పక్కనే ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ఏరియా పేరుతో 18.8 ఎకరాల ఖాళీ స్థలాన్ని వుంచుతున్నారు. దానిపక్కనే 30.07 ఎకరాల విస్తీర్ణంలో ఎమ్యూజ్‌మెంట్ పార్కును , దానికి కొంచెం పై ఎత్తులో వుండేవిధంగా 7.42 ఎకరాలలో క్రాఫ్ట్ బజారును ఏర్పాటుచేస్తారు. జలాశయానికి తూర్పు మధ్యస్థంగా ఎడ్వంచర్ పార్కు (పిల్లల సాహస ఉద్యానవనం)ను 15 ఎకరాలలో ఏర్పాటు చేస్తున్నారు. దాని పక్కనే మరో 20 ఎకరాల విస్తీర్ణంలో చాల ప్రత్యేకమైన రీతిలో వైల్డర్‌నెస్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకు అడవి అనుభవాన్ని అందించేవిధంగా దీనిని చాల ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అంటే ఇందులో ఫారెస్ట్ థీమ్ సెటప్‌తోపాటు బర్డ్స్ పార్కు, రైన్ ఫారెస్ట్ కేఫ్, టెంటెడ్ కాటేజీలు, టెంటెడ్ క్యాంపులు, ఫారెస్ట్ రెస్టారెంట్‌ల వంటివాటిని ఏర్పాటుచేస్తారు. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేలా ఈ వైల్డర్‌నెస్ పార్కు చాల అద్భుతంగా ఏర్పాటుకాబోతుంది. ఈ పార్కులో చాల విలువైన వృక్షాలను కూడ ఏర్పాటుచేస్తారు. ముఖ్యంగా పురాతన మూలికా మొక్కలతోపాటు మహాశివునికి ప్రీతిపాత్రమైందిగా భావించే మహాబిల్వ తోపాటు రుద్రాక్ష మొక్కలను కూడ ఇందులో ఏర్పాటుచేస్తారు. అవసరాన్ని బట్టి ట్రాన్స్ లోకేట్ పద్ధతిలో ఈ చెట్లను పార్కులోనికి తరలించాలనే ఆలోచన చేస్తున్నారు.. జలాశయానికి పశ్చిమంగా 18.8 ఎకరాల విస్తీర్ణంలో ఏడీసీఎల్ వారి ఆధ్వర్యంలో ఓ నర్సరీని ఏర్పాటుచేస్తారు. దీనికి సమీపంలో 4.25 ఎకరాలలో స్పోర్ట్స్ అండ్ రిక్రియేషన్ క్లబ్‌ను, మరో పదెకరాలలో ఎకోపార్కును ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం పార్కుకు నైరుతీదశలో పార్కు నిర్వహణ బాధ్యతలను చూసేందుకుగాను ఏడీసీఎల్ వారి పాలనా భవనాన్ని 1.57 ఎకరాలలో నిర్మిస్తారు. దీనికి చేరువలో అంటే దక్షిణంలో మూడు నక్షత్రాల హోదాగల రిసార్టులను 3.05 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబోతున్నారు.

ఇవికాకుండా పార్కులో మూడు వేర్వేరు ప్రాంతాలలో ఒక్కోటి రెండేసి ఎకరాల విస్తీర్ణంలో వుండేలా మొత్తం మూడు పార్కింగ్ ఏరియాలను ఏర్పాటుచేస్తారు. పార్కులో ఎటునుంచి ఎటు వెళ్లాలన్నా 25 మీటర్ల వెడల్పుకలిగిన రహదారులు వుంటాయి. వీటితోపాటు షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లు, ఫుడ్‌కోర్టులతో కూడిన రెండు కుటుంబ వినోదకేంద్రాలు, వినోద ఉద్యానవనం, యాంఫీ థియేటర్లు, మ్యూజికల్ ఫౌంటేన్ అండ్ లేజర్ షోలను కూడ ఏర్పాటు చేస్తారు. వేయి చదరపు గజాలలో పార్కు చుట్టూ తిరగడానికి పర్యావరణ అనుకూలమైన ట్రాకలెస్ టాయ్ ట్రైన్‌ను కూడ సందర్శకులకు అందుబాటులో వుంచుతారు. మొత్తంమీద రాజధాని అమరావతికి ఈ పార్కు ఓ పెద్ద ఎస్సెట్‌లా వుండబోతుంది. అమరావతి ఖ్యాతిని దశదిశలా పెంచేలా దీనిని నిర్మిస్తున్నారు. ఈ పార్కుద్వారా పర్యావరణహిత పర్యాటకాభివృద్ధి, ముఖ్యంగా విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా దీనిని నిర్మిస్తున్నారు.

ఈ మొత్తం సెంట్రల్‌పార్కులో మధ్య 50.69 ఎకరాలు జలాశయానికి పోగా, దాని చుట్టూ వివిధ రకాల పార్కులను 93.65 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ కింద ఏర్పాటు చేస్తున్నారు. మరో 107.79 ఎకరాల్లో రిసార్టులు, మూడు, అయిదు నక్షత్రాల హోటళ్లు, పార్కింగ్ ప్రదేశాలు, కుటుంబ వినోదకేంద్రాలను ఏడీసీఎల్ ఏర్పాటుచేస్తుంది. ఈ సెంట్రల్‌పార్కు అభివృద్ధి పనులను ప్రస్తుతం ప్రగతి గ్రీన్ రిసార్ట్స్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టారు. శాఖమూరులో ఏర్పాటవుతున్న ఈ సెంట్రల్‌పార్కుతోపాటు మల్కాపురం వద్ద 21 ఎకరాలలోను, అనంతవరం వద్ద 35 ఎకరాల్లోను మరో రెండు పార్కులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తుంది. ఈ పార్కులోనే స్వర్గీయ పొట్టి శ్రీరాములు స్మారకవనాన్ని కూడ ఏర్పాటుచేసే దిశగా రాష్ట్రప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తుంది.



పార్కు మధ్యలో ఏర్పాటవుతున్న జలాశయం



శాఖమూరులో ఏర్పాటవుతున్న సెంట్రల్ పార్కు తాలూకు మాస్టర్‌ప్లాన్

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

గుంటూరు(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 8 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటివరకు 753 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాస రావు, సురేష్‌బాబు అభినందించారు.

29 నుంచి తెనాలిలో జాతీయ ఎడ్ల బలప్రదర్శన

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలిరూరల్, మార్చి24(ఆంధ్ర జ్యోతి): తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకు జాతీయ ఎడ్లబల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయమార్కెట్ యార్డులో ఏర్పాట్లను ఆయన పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేలా ఎడ్లబలప్రదర్శన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజయం సాధించిన ఎడ్లజతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ఇదే ప్రాంగణంలో పశుపాల పోటీలు, పశువుల అందాల పోటీలు సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యవసాయంలో వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకునేలా అవగాహన, సాంకేతిక పరిజ్ఞానంతో హార్టికల్చర్, అగ్రికల్చర్‌లో వచ్చిన యంత్రాల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పర్యవేక్షణలో 18కమిటీలు పనిచేస్తు వివరించారు. సుమారుగా 125 నుంచి 150 జతల వరకు పోటీల్లో పాల్గొననున్నట్లు తెలియజేశారు. పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో ప్రముఖులు పాల్గొంటారని కుల,మత,రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, నిర్వాహక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు



సీఆర్‌డీఏ కార్యాలయంలో రైతుకు ప్లాటు కేటాయిస్తున్న అధికారులు

విజయవాడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేట, లెనిన్ సెంటర్‌లోని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కార్యాలయంలో సోమవారం ఈ-లాటరీ విధానం ద్వారా గన్నవరం రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి భూము లిచ్చిన 99 మంది రైతులకు 227 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. వీటిలో 147 నివాస ప్లాట్లు కాగా, 80 వాణిజ్య ప్లాట్లున్నాయి. ఈ-లాటరీకి హాజరైన రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రయల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను నిర్వహించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు గుడివాడ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్‌డీవో) బాలసుబ్రహ్మణ్యంతో కలిసి సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ సేకరణ) ఎన్.ఎస్.వి.బి వసంత నాయుడు మాట్లాడుతూ ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించటానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. సీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను చేరవేయటంలో కేవీకేలదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జీవీ రమణ

లాంఫాం(తాడికొండ)మార్చి 24(ఆంధ్రజ్యోతి): పరి శోధనల్లో రూపుదిద్దుకున్న సాంకేతికతను రైతులకు చేరవేయటంలో కృషి విజ్ఞాన కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని శ్రీవెంకటేశ్వర పశు వైద్య విశ్వవి ద్యాలయం ఉపకులపతి డాక్టర్ జేవీ రమణ పేర్కొ న్నారు. సోమవారం లాంఫాంలోని కృషి విజ్ఞాన కేంద్రం లో శాస్త్రీయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ రమణ ఈ సందర్భంగా మాట్లాడారు. పాడి రైతులకు వ్యవసాయంలో కావాల్సిన సలహాలు, సూచనలు ఎప్ప టికప్పుడు కేవీకే శాస్త్రవేత్తలు ఇస్తున్నారన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. కేవీకేల ద్వారా అనేక సర్టిఫికెట్ కోర్సులను అందుబాటులో తీసుకువచ్చారన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ శాస్త్రీయ సలహా మండలి సూచనలు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించే క్రమంలో అంతరాలను గుర్తించి వాటిని పూరించటానికి కేవీకే పనితీరు మెరుగుపరచడానికి ఎంతో కీలకమైనవని తెలిపారు. అనంతరం 2024-25 సంవత్సరంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 2025-26 కార్యచరణ ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ బీ.రేఖామణి, లాంఫాం కేవీకే అధినేత డాక్టర్ ఎం.యుగంధర్, డాక్టర్ శివనారాయణ, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ వో.నరసింహారావు, ఎల్‌ఆర్‌ఎస్ హెడ్ డాక్టర్ ముత్తారావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ దీపా పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్ల నిధుల విడుదల

తెనాలి అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్‌లకు రూ.28.09 కోట్లు విడుదల చేశారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస రావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో క్లస్టర్‌కు ఒక స్కూల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసి ప్రతి నెలా ఒక రోజు ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించి శిక్షణ అందిస్తున్నారు. ఇందుకోసం ఒక్కో కాంప్లెక్స్‌కు రూ.లక్ష కేటాయించారు. వీటిల్లో సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయుల ట్రావెలింగ్ అలవెన్స్ కింద రూ.10 వేలు, నిర్వహణ కింద రూ.30 వేలు, కంటిమ్‌జెన్సీ గ్రాంట్ రూ.35 వేలు, బోధన ఉపకరణాలకు రూ.25 వేలు కేటాయించారు. ఈ విద్యా సంవత్సరానికి గాను కేటాయించిన నిధులను సద్వినియోగం చేసి బిల్లులు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2809 క్లస్టర్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాకు రూ.64 లక్షలు, బాపట్ల జిల్లాకు రూ.79 లక్షలు, పల్నాడు జిల్లాకు 107 లక్షలు విడుదల అయ్యాయి.

అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్‌పై వేటు

వీఆర్‌కు పంపుతూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాలు



గుంటూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలోని అచ్చంపేట సీఐ కే వెంకట ప్రసాద్‌పై వేటుపడింది. ఆయనను వీఆర్‌కు పంపుతూ ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన ఎస్‌ఐగా పల్నాడుతో పాటు జిల్లాలోని పలు స్టేషన్లలో విధులు నిర్వహించారు. సీఐగా ఉద్యోగోన్నతి పొందిన తరు వాత గుంటూరు స్పెషల్ బ్రాంచ్‌లో గత ఎన్నికల సమయంలో విధులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వెంకటప్రసాద్‌ను అచ్చంపేట సీఐగా నియమించారు. సమర్థవంతంగా విధులు నిర్వహించలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులకు సహకరించకపోగా ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అపవాదు మూటగట్టుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రంధసిరి గ్రామానికి సంబంధించిన వైసీపీ నాయకుడిపై నమోదైన కేసులో ఆయన వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినట్లు టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఆ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ అతన్ని వదిలి వేశాడు. ఈ వ్యవహారం వివాదాస్పదం కావడం తో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అయితే సీఐకు తెలియకుండా వైసీపీ నాయకుడిని వదిలిపెట్టి ఉండరనే ఆరోపణలు వచ్చాయి. సుమారు ఐదారు నెలల క్రితం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటన అనంతరం కూడా సీఐ వెంకట ప్రసాద్‌లో మార్పు రాలేదు. ప్రతిపక్ష వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఆరోపించారు. మరోవైపు పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయడంలోనూ విఫలమవుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయన పనితీరు ఏమాత్రం సంతృప్తికరంగా లేదని నిఘావర్గాలు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాయి. వీటన్నింటి నేపథ్యంలో వెంకటప్రసాద్‌ను వీఆర్‌కు పంపుతూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎయిర్ ట్యాక్సీ @ గుంటూరు

అత్యాధునిక ప్రయాణ సాధనాన్ని ఆవిష్కరించిన ఆంధ్రా కుర్రోడు



గుంటూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ ట్యాక్సీ పేరుతో అధునాతన గగన రవాణాకు ఉపకరించే ప్రయాణ సాధనం గుంటూరులో రూపుదిద్దుకుంటుంది. ఇప్పటివరకు ప్రపంచంలో కేవలం చైనాకు మాత్రమే పరిమి తమైన అధునాతన రవాణా వ్యవస్థను గుంటూరుకు చెం దిన యువ రోబోటిక్స్ ఇంజినీర్ అభిరామ్ చావా పరిచయం చేస్తున్నాడు. ప్రయోగాలు అన్నీ పూర్తి చేసుకుని కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నాడు. అభిరామ్ అమెరికాలో రోబోటిక్స్ ఇంజినీరింగ్ పీజీ పూర్తి చేశాడు. ఆయనలోని సాంకేతిక పరిజ్ఞానాన్ని గుర్తించిన అమెరికా, చైనా లోని పేరొందిన సంస్థలు ఎక్కువ మొత్తం జీతంతో ఉద్యోగాన్ని ఇచ్చేందుకు ఆసక్తి చూపించాయి. నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశానికి సేవ చేసేందుకు మాత్రమే వినియోగించాలని సంకల్పించిన అభిరామ్ 2017లో గుంటూరుకు వచ్చేశారు.

మ్యాగ్నం వింగ్స్‌కు అంకురార్పణ

గుంటూరు ఏటుకూరు రోడ్డులో మ్యాగ్నం వింగ్స్ అనే సంస్థలో వీ-2 పేరుతో ఎయిర్ ట్యాక్సీ తయా రీకి ఉపక్రమించారు. ఎయిర్ ట్యాక్సీ తయారీకి వినియోగించే ప్రతి వస్తువును స్వయంగా తయారు చేశారు. రెండు, మూడేళ్ల శ్రమ తర్వాత వీ-2 ప్రయోగానికి సంపూర్ణంగా సిద్ధమైంది. ప్రయోగం పూర్తిగా సఫలం కావడంతో ఎక్స్-4 పేరుతో ఎయిర్ క్రాఫ్ట్ తయారు చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం అది ప్రయోగానికి సిద్ధమవుతుంది.

ప్రయాణం ఇక సులువు..

అభిరామ్ తయారు చేసిన ఎయిర్ ట్యాక్సీ వినియోగం ద్వారా ప్రయాణం సులువు అవుతుంది. ఉదాహరణకు గన్న వరం విమానాశ్రయం నుంచి విజయవాడకి వచ్చేందుకు ట్రాఫిక్ అవాంతరాలు ఎదురవుతాయి. అదే ఎయిర్ ట్యాక్సీలో ఆ సమస్య ఉండదు. ఉదాహరణకు రోడ్డు మార్గం ద్వారా 30 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి గమ్యస్థానం చేరుకుంటే, ఎయిర్ ట్యాక్సీలో కేవలం 10 కిలోమీటర్లు ప్రయాణించి గమ్యస్థానం చేరవచ్చు. వీ-2 భూమి నుంచి 1100 అడుగులో 100 కిలోమీటర్ల వేగంతో నడుస్తోంది. ఎక్స్- 4 మాత్రం భూమి నుంచి రెండు వేల అడుగుల దూరంలో 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. అభిరామ్ తయారు చేసిన రెండు అత్యధునాతన ప్రయాణ సాధనాలు అటానమస్ సిస్టం(స్వయం నియంత్రణ) విధానంలోనే పనిచేస్తాయి. ప్రో మొబిలిటీ కాన్సెప్ట్ (సంభావ్యత)తో రూపొందించారు. రెండు వాహనాలు బ్యాటరీతో పనిచేస్తాయి. ఎక్స్- 4ను ఇంధనంతో కూడా నడపవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో ఎయిర్ క్రాఫ్ట్ ను అంబులెన్స్‌గా వినియోగించవచ్చు.

క్యాబ్ ఖర్చుతో అందుబాటులోకి..

చూడటానికి విమానం, హెలికాప్టర్‌లా ఉండే ఎయిర్ ట్యాక్సీలో ప్రయాణ ఖర్చు కూడా తక్కువే. క్యాబ్‌కు అయ్యే ప్రయాణ ఖర్చు మాత్రమే అవుతుంది. వీ-2, ఎక్స్- 4 కొనుగోలు ఖర్చు మాత్రం రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుమతి కోసం ఎదురు చూస్తున్నట్టు అభిరామ్ తెలిపారు. అది చట్టం రూపేణా అమల్లోకి రావడానికి ఏడాది పడుతుందని తెలిపారు. మొదట్లో పైలెట్ లేకుండా ప్రయాణించే విధంగా తయారు చేశామని తెలిపారు. ప్రభుత్వం అందుకు అనుమతి ఇస్తుందో లేదో చూడాలన్నారు. భూమి మీద నుంచి గగనతలంలో వెళ్లే ఈ వాహనాలను నియంత్రించవచ్చని తెలిపారు. డాబాపై ల్యాండింగ్ చేయవచ్చన్నారు. టేకాఫ్, ల్యాండింగ్ రోడ్డుపై చేసేలా తయారు చేశామని తెలిపారు.



అభిరామ్ చావా తయారు చేసిన ఎయిర్ ట్యాక్సీ

దేశానికి వినియోగపడితే చాలు..

నేను చదివిన చదువు ఈ దేశానికి మొదట ఉపయోగపడాలి. ఆ ఉద్దేశంతోనే ఇక్కడకు వచ్చి వీ-2 వాహనం తయారు చేశాను. ఎక్స్- 4 కూడా రెండు, మూడు నెలల్లో ప్రయోగిస్తాం. ప్రభుత్వం అనుమతి ఇస్తే రోజుకు ఒకటి తయారు చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వంతో కొన్ని సంప్రదింపులు జరుతున్నాయి.

అభిరామ్ చావా,మ్యాగ్నం వింగ్స్ అధినేత



రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

బాధిత కుటుంబాలకు పరామర్శ

పంగులూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మంత్రి రవికుమార్ సోమవారం పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ముప్పవరం గ్రామానికి చెందిన షేక్ అశ్రున్‌బీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, నివాసానికి వెళ్లిన మంత్రి ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మహిళా కూలీలు చింతల లక్ష్మమ్మ, వరపర్ల భారతి, పాలపర్తి సుభాషిణిలను వారి నివాసాల వద్దకు వెళ్లి పరామర్శించారు. ముప్పవరం గ్రామంలో ఇటీవల గుండె సమస్యతో మరణించిన వినుకొండ భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొండమంజులూరు మృతి చెందిన చిలుకూరి రంగయ్య దశ దిన కర్మ కార్యక్రమంలో పాల్గొని మంత్రి గొట్టిపాటి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, మండల నేతలు కేవీ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, బాలిన రామసుబ్బారావు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, చింతల సహదేవుడు, గరిమిడి జగన్మోహన్, మస్తాన్‌వలి, వరపర్ల సుబ్బారావు, బత్తుల వెంకటరావు, నార్నె సుబ్బారావు, బొప్పూడి నాగేశ్వరరావు, చిలుకూరి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మూగ బాలుని వైద్యానికి మంత్రి ఆదేశం

మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముప్పవరం గ్రామంలో మాటలు రాని కంచర్లపల్లి విశ్వనాథ్ అనే ఐదేళ్ల బాలునికి తగిన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని తన వ్యక్తిగత సిబ్బందిని ఆదేశించారు. ముప్పవరం గ్రామంలోని హౌసింగ్ లేఅవుట్‌లో నివాసం ఉంటూ ఆటో ప్రమాదంలో మృతి చెందిన అశ్రున్‌బీ కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం కాలనీలో నివాస గృహం పైగా ఉన్న విద్యుత్ లైన్‌తో పాటు, ప్రహరీకి దగ్గరగా ఉన్న ట్రాన్స్‌ఫారంతో ప్రమాదం పొంచిఉందని స్థానికులు సమస్యను మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే చర్యలుచేపట్టాలని సిబ్బందిని మంత్రి ఆదేశించారు. గుండె సమస్యతో మరణించిన వినుకొండ భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కూటమి విజయం మాదిగలకు వరం



హర్షం వ్యక్తం చేస్తున్న మాదిగ సంఘాల నాయకులు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి విజయంతోనే వర్గీకరణ సాధ్యమైందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ రుణం తీర్చుకోలేనిదని ఎంఆర్‌పిస్, అనుబంధ సంఘాల నాయకులు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక విఠల్‌నగర్‌లో విజయ సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి, మంద కృష్ణ మాదిగలను కొనియాడారు. పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, దుడ్డు వందనం, రమేష్, యేసురాజు, జేమ్స్. వెంకట్ తదతరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఇంకొల్లు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ బండారు అనూష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు నివేదికలతోనూ, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిష్యత్



శిక్షణ పత్రాలను అందుకున్న అభ్యర్థులను అభినందిస్తున్న ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణతో కూడిన విద్యతో యువతకు బంగారు భవిష్యత్ ఉంటుందని వేటపాలెం బండ్ల బాపయ్య హిందూ కళాశాల అధ్యక్షుడు బండ్ల అంకయ్య అన్నారు. కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన చెన్నైకు చెందిన ఖోఖో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కన్సల్టెన్సీ సుమారు 4 నెలల శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. అందులో పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సోమవారం శిక్షణ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి చెన్నై కంపెనీ వారు ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించినట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చల్లా వాసుదేవ రావు, బండ్ల రవీంద్రనాథ్, ఆదిలక్ష్మీ, మల్లేశ్వరరావు, హోరాంబ, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో దంపతుల అదృశ్యం

కేసు నమోదు

అద్దంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో దంపతులు అదృశ్యంపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇందిరానగర్‌కు చెందిన ఆలకుంట వెంకటరావు, అంజలికి మూడు సంవత్సరాల కిందట వివాహం జరిగింది. అంజలి 7 నెలల గర్భిణి. ఆదివారం అంజలి తల్లి వెళ్లి చూడగా ఇంట్లో భార్యభర్తలిద్దరూ లేరు. హాస్పటల్‌కు వెళ్లి ఉంటారని భావించారు. అయితే తిరిగి రాకపోవడంతో అద్దంకి, ఒంగోలులలోని ఆసుపత్రులకు వెళ్లి వెతికారు. ఇంట్లోకి వెళ్లి చూడగా లెటర్ కనిపించింది. ఎక్కడెక్కడ ఎంత అప్పు ఉందో రాసి ఉంది. మమ్మలను వెతక వద్దు, మేము మీకు కనిపించమని రాసి ఉంది. అదే సమయంలో ఇంటిని అమ్మి బాకీలు చెల్లించాలని రాసి ఉంది. దీంతో ఆందోళనతో కుటుంబసభ్యులు వెతికారు. కనిపించకపోవడంతో అంజలి తండ్రి కుంచాల శ్రీనివాసరావు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

వాగును కమ్మేసిన ముళ్లపొదలు

- ముందుకు కదలని నీరు
- కొద్దిపాటి వరదలు సంభవిస్తే పొలాలు ముంపునకు గురికావాల్సిందే
- కన్నెత్తి చూడని డ్రైనేజీ అధికారులు



పర్చూరు వాగులో అడవిని తలపిస్తున్న ముళ్లచెట్లు

పర్చూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వాగులో చిల్లచెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. సంవత్సరాల తరబడి వాగులో ముళ్ల చెట్లు పెరిగిపోవడంతో కొద్దిపాటి వరదలు సంబవించినా, భారీ వర్షాలు కురిసినా వాగులో నీరు ముందుకు కదలక సమీపంలోని వందల ఎకరాల పంట పొలాలను ముంచెత్తే పరిస్థితి నెలకొంది. గత వైసీపీ పాలనలో వాగుల అభివృద్ధిని పట్టించుకోక పోవడంతో ఎక్కడ చూసినా పెద్దపెద్ద ముళ్లపొదలే దర్శనమిస్తున్నారు. వాగుల కట్టలను పటిష్ట పరచక పోవడం, అభివృద్ధి చేయక పోవడం, ఆపై ముళ్ల పొదలు పెరిగి పోవడంతో ఉన్న వాగు కాస్త కాలువను తలపించే విధంగా తయారైంది. పర్చూరు - కారంచేడు మధ్య డ్రైనేజీ కాలువ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో వాగుల అభివృద్ధి పేరుతో ఇష్టారాజ్యంగా మట్టిని త్వవ్వుకునేందుకు అనుమతించిన అధికారులు ఆపై వాగు అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ఏళ్ళ తరబడి వాగుల అభివృద్ధికి చర్యలు చేపట్టక పోవటం, గ్రామాల్లోని మురుగు, ఇతర వ్యర్థాలు నేరుగా వాగులోకి చేరడంతో సమస్య మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన నెలకొంది. వాగుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అనేక మార్లు రైతులు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఇదిగో అభివృద్ధి అదిగో అభివృద్ధి చేస్తామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప కార్యాచరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాగులో పెరిగిపోయిన ముళ్ల పొదలను తొలగించడంతోపాటు, వాగు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఆ దిశగా అధికారులు దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వాగు కుంచించుకుపోయి కాలువలా ఉన్న నీటి ప్రవాహం

రేపు ఐటీఐ కాలేజీలో జాబ్ మేళా

ఇంకొల్లు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మారుతీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 26వ తేదీన బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. టెన్త్, డిప్లమో, డిగ్రీ అభ్యర్థులను సోలార్, టెక్స్‌టైల్స్‌లో ఉద్యోగాలు పొందేందుకు గోదావరి ఆంధ్ర మ్యూచువలీ ఎయిడెడ్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ, ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, ఆవిష్కరణ్ ఇండస్ట్రియల్, ఇండోసోలార్ కంపెనీల వారు ఇంటర్వ్యూలు చేస్తారని తెలిపారు. అభ్యర్థులు అర్హత సర్టిఫికెట్‌లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

మహనీయుల విగ్రహాల జోలికి వెళ్లొద్దు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలకు అవమానం కలిగించేలా వ్యవహరించడం దుర్మార్గమని దళిత బహుజన పార్టీ నాయకులు షేక్ జిలానీ అన్నారు. ఇటీవల తూర్పు గోదావరి జిల్లా నల్లచర్లలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు చెప్పులు వేసి అవమానించడం క్షమార్హమన్నారు. వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్షయ లక్షణాలను తెలుసుకుని చికిత్స పొందండి



ముప్పవరం, మార్టూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన కలిగి తగిన చికిత్స పొందాలని జిల్లా వ్యాధి నిరోధకాల అధికారి డాక్టర్ మనోజ్ ప్రద్యుత్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినం సందర్భంగా సోమవారం అద్దంకి పట్టణంలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలనీ డాక్టర్ మనోజ్ ప్రద్యుత్ ప్రారంభించారు. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు మూడు నెలల నుంచి తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ లక్షణాలపై అవగాహన కలిగి ఉండి ఆశా, ఏఎన్ఎంలకు తెలియజేసి వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష, గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జయసింహ, డాక్టర్ మాధురి, వైద్యుడు డాక్టర్ హరికృష్ణ, ఎంపీహెచ్ఈవో నాగేశ్వరరావు, పీహెచ్ఎన్ కన్యాకుమారి, ఎస్‌టీఎస్ రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా ముప్పవరం గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య క్షయపై అవగాహన కల్పించారు. బీసీ వసతి గృహ బాలికలతో నిర్వహించిన ర్యాలీలో వార్డెన్ పద్మావతి, సూపర్‌వైజర్ హరిబాబు, ఏఎన్ఎం శేషకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

మార్టూరు : క్షయవ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులను ఇస్తున్నదని మార్టూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరు సూపరింటెండెంట్ డాక్టరు విష్ణుతేజ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినం సందర్భంగా మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహ ర్ష ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ స్టాఫ్ వెంకటరత్నం, ఇంకా పలువురు వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్తకి జీవిత ఖైదు

చిన్నగంజాం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు విధిస్తూ ఒంగోలు ఏడీజే కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. నిందితులకు శిక్ష పడడంలో సమర్థవంతంగా విధులు వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసులు తెలిపిన కేసువివరాల ప్రకారం, బాపట్ల జిల్లా, చిన్నగంజాం గ్రామంలోని మహాలక్ష్మి కాలనీకి చెందిన కత్తి శ్రీను తన భార్య కత్తి దుర్గను గత ఏడాది 07-06-2024న చెట్ల నరికే కత్తితో నరకంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో దుర్గ తన తల్లిదండ్రులు మల్లవరపు అంజయ్య, రాఘవమ్మ ఇంటిలో తన బిడ్డలతో ఉంటుండగా భర్త ఇలాంటి చర్యకు పాల్పడ్డాడు. ఈఘటనపై దుర్గ తల్లి మల్లవరపు రాఘవమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి అప్పటి ఎస్సై ఎం.శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు విచారణ చేసి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం ప్రస్తుత ఇంకొల్లు సీఐ వై.రమణయ్య మిగిలిన దర్యాప్తును వేగవంతం చేసి కోర్టుకు అభియోగపత్రం దాఖలు చేశారు. అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. నిందితునిపై నేర నిరూపణ కావడంతో న్యాయాధికారి యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.1600 జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చారు.

సాగర్ కాలువల మరమ్మతులను వెంటనే ప్రారంభించాలి

ఈఈ సతీష్



ఎన్నెస్పీ ఈఈ సతీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీ అధ్యక్షులు

అద్దంకి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల మరమ్మతుల పనులు నీటి విడుదల నిలిపివేసిన వెంటనే ప్రారంభించాలని ఈఈ సతీష్ అన్నారు. అద్దంకి డివిజన్ ఈఈగా సతీష్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో సోమవారం అద్దంకి నియోజకవర్గంలోని అద్దంకి, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీల అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, యలమందయ్య లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాగు నీటి విడుదల విషయమై చర్చించగా మార్చి చివరి వరకు మాత్రమే సాగు నీరు విడుదల జరుగుతుందని, ఆ వెంటనే ఆ కాలువలలో పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. మే నెలలో తాగునీటి అవసరాలకు సాగర్ నీరు విడుదల జరిగే అవకాశం ఉన్న నేపధ్యంలో ఏప్రిల్‌లో మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు.

మళ్లీ.. హ్యాపీనెస్ట్

(5వ పేజీ తరువాయి)

నేలపాడు వద్ద ఓవైపు ఎన్-12, ఎన్-13ల మధ్య ఇంకోవైపు ఈ-7, ఈ-8ల మధ్య రహదారుల వెంబడి 14.46 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టింది. మొత్తం 1200 ఫ్లాట్లు.. 12 టవర్లను 2బీ+జీ+18 అంతస్తులుగా నిర్మించాలని ప్రతిపాదించింది. అప్పట్లో ప్రాజెక్టు మొత్తం ఖర్చును రూ.714 కోట్లుగా అంచనా వేసి నిర్మాణ పనులను షాపూజీ పల్లోంజీ సంస్థకు అప్పగించింది. చదరపు గజం ధరను రూ.4049 వంతున నిర్ణయిస్తూ ప్రాజెక్టును ప్రకటించగా.. జనం ఎగబడి ఇంచుమించుగా 1185 మంది ఫ్లాట్లను బుక్ చేసుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అటకెక్కించింది. దీంతో ప్రాజెక్టు పనులు కేవలం పైల్స్ టెస్టింగ్ వరకు మాత్రమే పరిమితమయ్యాయి. దీంతో ఫ్లాట్లు బుక్ చేసుకున్న వారంతా గగ్గోలు పెట్టారు. వీరిలో సుమారు వంద మంది కావాలని కోరడంతో రూ.25 కోట్ల మేర అడ్వాన్స్‌లను ఇచ్చేశారు. బుక్ కాని 15 ఫ్లాట్లతో పాటు వంద మంది నగదు వెనక్కి తీసుకోవడంతో ప్రస్తుతం 115కు పైగా ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే బుక్ అయిన ఫ్లాట్లను మినహాయించి ఖాళీగా ఉన్న ఫ్లాట్‌లను కొత్తగా బుక్ చేసుకునేవారికి మాత్రం పెరిగిన నిర్మాణ వ్యయాన్ని బట్టి ఎస్ఎఫ్‌టీ రేట్లను నిర్ణయిస్తారు. పాతవారి నుంచి మాత్రం అదనంగా పైసా కూడా వసూలు చేయరు. ప్రస్తుతం ప్రాజెక్టు స్థలంలో నెలరోజులుగా నీటి తోడివేత పనులు చేపట్టి జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నారు. ప్రాజెక్టు పనులు రెండేళ్లకు పైబడి సాగనుండడంతో ఆ ప్రాంగణంలోనే కార్మికులు నివాసం ఉండేందుకు వీలుగా తాత్కాలిక షెడ్లను కూడా నిర్మించారు. భవన నిర్మాణపనులను ఆరంభించేందుకు ముందస్తు ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు.

రెండేళ్లలో పనులు పూర్తి

ఈ ప్రాజెక్టులో 1225, 2750 చదరపు అడుగుల విస్తీర్ణం కల ఫ్లాట్లు ఉన్నాయి. ఇందులో 144 ఫ్లాట్లు డబుల్ బెడ్ రూమ్‌వి కాగా, 1036 ట్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లుగా ఉంటాయి. మొత్తం విస్తీర్ణంలో అత్యధిక భాగం ల్యాండ్‌స్కేపింగ్, అంతర్గత రోడ్ల కోసమే వినియోగించేలా ప్రణాళికను రూపొందించారు. ఒక్కో అంతస్తులో రెండేసి పార్కింగ్ ఫ్లోర్‌లకు స్థానం కల్పించి మొత్తం 12 టవర్లలో కలిపి 1631 కార్లు, 1200 బైకులను పార్కింగ్ చేసుకునేలా వెసులుబాటును కల్పిస్తున్నారు. ఇవిగాక మరో రెండు ఎమినిటీస్ బ్లాకులను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే రెండేళ్లలోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

సమస్యల వలయంలో ఆరో వార్డు



వార్డులో అధ్వానంగా డ్రెయిన్‌లు



శిథిలావస్థకు చేరిన డ్రెయిన్, పక్కన చెత్తా చెదారం

అధ్వానంగా డ్రెయిన్లు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 6వ వార్డు సమస్యల వలయంలో ఉంది. వార్డులో పారుదల లేని డ్రెయిన్‌లు, ప్రమాద భరితమైన జంక్షన్, ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ నేతలు వార్డులో సమస్యలు గురించి పట్టించుకోలేదు. వార్డులో సుమారు 2 కిలో మీటర్ల మేర అంతర్గత రహదారులు ఉన్నాయి. వాటిల్లో చాలా వరకు దెబ్బతిన్నాయి. అయితే ఈ రహదారుల వెంబడి పూర్తి స్థాయిలో డ్రెయిన్‌లు లేవు. ఉన్న అరకొర డ్రెయిన్‌లు శిథిలదశకు చేరుకుని పారుదల లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీంతో డ్రెయిన్‌లలో మురుగు వలన దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. శానిటేషన్ నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. కాలువల్లో పూడికలు తీస్తున్నా ఆయిల్ బాల్స్ వినియోగం లేదు. బ్లీచింగ్ చల్లడం లేదు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. వార్డులో ఎక్కువ భాగం ఇరుకు రోడ్లు కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వార్డులో సమస్యలు ఇలా మోత మోగిస్తున్నా ఆ వార్డు కౌన్సిలర్‌గా గెలిచి నేడు చైర్మన్ హోదాలో ఉన్న జంజనం శ్రీనివాసరావు వాటిపై దృష్టి సారించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చైర్మన్, మునిసిపల్ అధికారులు వార్డులో సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



వార్డులో ప్రమాద భరితంగా జంక్షన్

దివ్యాంగుని పెన్షన్ నిలిపివేశారంటూ కలెక్టర్‌కు వినతి



కలెక్టరేట్ ఆవరణంలో విలేకరులతో మాట్లాడుతున్న దివ్యాంగుడు, తండ్రి గోపాళం

బాపట్లరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నా కుమారుడు పులుగు వెంకటనారాయణ పుట్టకతోనే వికలాంగుడు. అయితే తనకు వస్తున్న పెన్షన్‌ను ఇటీవల నిర్వహించిన సర్వే వలన ఆపేస్తామంటూ అధికారులు తెలపటంతో తమకు న్యాయం చేయాలంటూ సోమవారం కలెక్టర్‌కు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వికలాంగుని తండ్రి గోపాళం వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో విలేకర్లతో మాట్లాడుతూ చీరాల మండలం కావూరి వారిపాలెంకు చెందిన నాకు పుట్టకతోనే కుమారుడు వికలాంగుడు నేను కూలి పనిచేసుకుంటూ అతని బాగోగులు చూచుకుంటూ ఉండేవాడిని 2009 నుంచి ఫించన్‌ను వస్తున్నది. అయితే ఇటీవల నిర్వహించిన సర్వేలో హ్యాండీక్యాప్ సర్టిఫికెట్ లేదని పెన్షన్ రాకపోవచ్చుఅని అధికారులు తెలపటం జరిగిందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు చెప్పటం జరిగిందని తెలిపారు.

చీరాలలో జోరందుకున్న క్రికెట్ బెట్టింగ్

- అత్యాశకు లోనై.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న యువత
- రెండు నెలల్లో రూ. కోట్లల్లో పందేలు జరిగే అవకాశం!
- పోలీసులు దృష్టి సారించకుంటే ప్రమాదమే

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ఊపందుకున్నాయి. దాదాపుగా రెండు మాసాలు ఈ మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లను కొందరు వినోదం కోసం చూస్తుంటే.. మరి కొందరు సులభంగా డబ్బు సంపాదించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఈక్రమంలో క్రికెట్ మ్యాచ్‌లను వేదికగా మలుచుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. అయితే అమాయకుల ఆశలను ఆసరాగా చేసుకుని బుకీలు డబ్బులు దండుకుని సామాన్యులను మోసగిస్తున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగే ఈ రెండు మాసాల్లో చీరాల నియోజకవర్గ పరిధిలోని బెట్టింగ్‌లు రూ.కోట్లలో చేరే అవకాశం ఉందని విశ్లేషకులు చెప్తున్నారు. బెట్టింగ్ వ్యసనాలకు బానిసలుగా మారిన యువత, జూదరులు ఉన్న కాడకి ముట్ట చెప్పుకుంటున్నారు. హద్దు దాటాక వాహనాలు, స్థిరాస్తులు వంటివి సర్వస్వం వదిలేసుకుంటున్నారు. ఈక్రమంలో అప్పులు ఊబిలోకి చేరి ఐపీలు పెట్టడం, బలవన్మరణాలకు పాల్పడడం వంటి ఘటనలు మనం చూస్తున్నాం.

పూర్తి స్థాయిలో నిఘా



ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్ యాప్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అలాగే కొన్ని నిర్దేశిత ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. బ్యాంకు ఖాతాల్లో పెద్ద మొత్తంలో లావాదేవీల డేటాను సేకరిస్తున్నాం. నేరస్థులు తప్పించుకోలేరు. యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండాలి.

- ఎండీ మొయిన్, డీఎస్పీ, చీరాల


రామాపురం రిసార్ట్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్, ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్

చాపకింద నీరులా..

బెట్టింగ్‌లు ఒకప్పుడు చీరాల పట్టణంలో లేదా పేరాల, వేటపాలెం, జాండ్రపేట, మండల పరిధిలోని ప్రధాన కేంద్రాలలోనే ఉన్నాయి. కానీ తాజాగా ఈ వ్యసనాలుకు గ్రామీణ యువకులు సైతం బానిసలుగా మారుతున్నారు. గతంలో ఆన్‌లైన్‌లో మాత్రమే బెట్టింగ్‌లు జరిగేవి. ఇప్పుడు సెల్‌ఫోన్ ఉన్న యువత వాట్సాప్, బెట్టింగ్ యాప్ వంటి వాటికి చేరువయ్యారు. దీంతో బంతి బంతికీ పందేలు కడతారు. చీరాల పరిధిలోని రిసార్ట్స్, లాడ్జీలు, బార్‌లు, ఎంజీసీ మార్కెట్ పరిధిలోని కొందరు యువత, విద్యార్థులు, క్రికెట్ వీరాభిమానులు బెట్టింగ్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు వినిపిస్తుంది.

పాత, యాక్టివ్ పాత్రలపై దృష్టి సారించాలి

చీరాల పరిధిలో ఇప్పటికే జాండ్రపేటకు చెందిన ఓ వ్యక్తి అత్యున్నత స్థాయిలో బుకీగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పేరాలలో మరో ఇద్దరు, వేటపాలెం, జవహర్‌నగర్, ఈపూరుపాలెం, గ్రామీణంలో అక్కడక్కడా యువత బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. ఈక్రమంలో పోలీసులు బెట్టింగ్‌పై కచ్చితంగా దృష్టి సారించాల్సిందే. అలాగే పాత, కొత్తగా ఫీల్డ్‌లోకి రంగ ప్రవేశం చేసిన వారిపైనా కన్నేయాలి. లేకుంటే ఎందరో జీవితాలు తారుమారయ్యే అవకాశం లేకపోలేదు. బుకీలకు పాల్పడే వారు ప్రత్యేకమైన ఫోన్ నెంబర్‌లను వాడుతున్నారు. మ్యాచ్ ప్రారంభమయ్యే అరగంట ముందు మాత్రమే ఆ నెంబర్‌ను వినియోగిస్తారు. మిగిలిన సమయమంతా ఆ నెంబర్ ఆఫ్‌లోనే ఉంటుంది. ఆన్ చేసిన సమయంలో గతంలో వారి వద్ద ఫీడ్ అయిన, వారి పాత పరిచయస్తుల నెంబర్‌లకు మాత్రమే ఆన్సర్ చేస్తారు. కొత్త నెంబర్‌లకు రెస్పాండ్ కాకుండా జాగ్రత్త పడతారు.

గతంలో అరకొర కేసులు



గతంలో చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జంజనం కాంప్లెక్స్‌లో యథేచ్ఛగా కొంతకాలం బెట్టింగ్ జరిగింది. దీంతో ఎట్టకేలకు పోలీసులు దాడులు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే టీవీతో పాటు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా చూసుకుంటే ఆ స్టేషన్ పరిధిలో 2016, 2021 సంవత్సరాల్లో వేటపాలెంలో 2021, 23లో రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఇక చీరాల రూరల్, టూటౌన్ పరిధిలో కేసులే లేవు. ఈ మధ్య కాలంలో అసలు దాడులే చేయలేదు. దీంతో బెట్టింగ్ రాయుళ్లకు, బుకీలు పోలీసుల శైలిని అలుసుగా తీసుకొని వారి దందా కానిస్తున్నారు. ఏదేమైనా పోలీసులు ఈసారి క్రికెట్ బెట్టింగ్‌లపై కన్నెర్ర చేయకుంటే ఎన్నో దారుణాలు చూడాల్సి వస్తుంది.

ఆకస్మిక దాడులు

క్రికెట్ బెట్టింగ్‌లు జోరుకుందుంటున్న నేపథ్యంలో సోమవారం రాత్రి ట్రైనీ డీఎస్పీ అభిషేక్ ఈపురుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్‌తో కలిసి రామాపురం, వాడరేవు తీరప్రాంతాల్లో లాడ్జిలు, రిసార్ట్‌లల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడి రికార్డులను పరిశీలించి, అనుమానితుల వివరాలను తెలుసుకున్నారు. బెట్టింగ్ నిర్వాహకులకు రూములు ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సూరవరపుపల్లి చెరువుకు వాగు నుంచి చేరుతున్న సాగర్ జలాలను పరిశీలిస్తున్న గ్రామస్థులు

సూరవరపుపల్లి చెరువుకు సాగర్ జలాలు

ఎమ్మెల్యే ఏలూరి సూచనలతో కదిలిన నాయకులు

యద్దనపూడి, (మార్టూరు) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలోని చెరువుకు దాదాపుగా కిలోమీటర్ దూరంలో ఉన్న వాగు నుంచి సాగర్ జలాలును సోమవారం నింపుతున్నారు. వాస్తవానికి గ్రామంలోని చెరువుకు డైరెక్టగా సాగర్ జలాలు చేరే అవకాశం లేదు. గ్రామ పంచాయతీ వారు చెరువులోని నీటిని సమీపంలోని బావిలోకి పంపింగ్ చేసిన తర్వాత మరల బావి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటిని ఎక్కించి అక్కడ నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన కొళాయిల ద్వారా ప్రజలకు తాగునీటిని విడుదల చేస్తుంటారు. అయితే గత నెల రోజుల నుంచి చెరువులోని నీరు పూర్తిగా అడుగంటిపోయాయి. దాంతో ఈ వేసవిలో గ్రామంలో తాగు నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని టీడీపీ గ్రామ నాయకులు కోయ సతీష్, కోయ శరత్ బాబు, ఇంటూరి వినయ్, వసంతరావు, నాగేశ్వరరావు తదితరులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో గ్రామ సమీపంలోని వాగుకు ప్రస్తుతం విడుదల చేసిన సాగర్ జలాలు చేరుతుండడంపై, వాగు నుంచి నీటిని చెరువుకు పంపించాలని, అందుకు సంబంధించి గ్రామ నాయకులకు సహకరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్యకు ఏలూరి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నుంచి టీడీపీ నాయకులు వాగు నుంచి పైపులు ద్వారా ప్రత్యేకంగా చెరువుకు నీటిని పంపిస్తున్నారు. దాదాపుగా వారం రోజులు వాగు నుంచి చెరువుకు నీటిని పంపిస్తే ఎండాకాలంలో గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య ఉండదని గ్రామస్థులు చెప్తున్నారు. ఈ వేసవి కాలంలో మాత్రం గ్రామంలో మంచినీటి సమస్య తీరినట్లేనని గ్రామస్థులు అంటున్నారు.

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో కే కుసుమకుమారి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీ-4 సర్వే పూర్తయితే గ్రామ సభలు నిర్వహించారు. అలానే పీజీఆర్ఎస్ సర్వే చేసి గతంలో ఫిర్యాదులు చేసిన వారితో సంతకాలు పెట్టించాలన్నారు. అలానే గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టాన్నారు. గ్రామాలలో తాగు నీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికల దాతల సహాయంతో చలి వేంద్రాలను ఏర్పాటు చేయించాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నిరు పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని కాలయాపన చేసి మోసగించిందని, కూటమి ప్రభుత్వమైనా ఆదుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆమంచి కృష్ణమోహన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో స్లిప్పులు మాత్రమే అందాయని, ప్రతిసారి సామాన్యులకు ఆశే తప్ప ఆదరణ లేదని నాయకులు అన్నారు. అనంతరం తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్. బాబూరావు, వసంతరావు, జయరాజ్, ఐవీ ప్రసాద్, సుధాకర్, ఖాలేషా, కోటేశ్వరమ్మ, లక్ష్మీ, ఏసుపాదం, పవన్ కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సాంబయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, మహిళలు పాల్గొన్నారు.

మార్టూరు : ఇంటి స్థలాలను మంజూరుచేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ టీ ప్రశాంతికి మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జనార్దన్‌నగర్ వాసులు వినతిపత్రం అందచేశారు. సీపీఎం మండల శాఖ కన్వీనర్ బత్తుల హనుమంతురావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాలనీ వాసు లు చినఅంజయ్య, రామాంజి, రాజమ్మ, వీరాంజి,కోటేశ్వరయ్య పాల్గొన్నారు.

జేకేసీ శిక్షణను విద్యార్థులు వినియోగించుకోవాలి


కేఆర్‌కేలో జేకేసీ గ్రాండ్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కళాశాలలోని జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ) ద్వారా అందించే శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగపర్చుకుని తద్వారా ఉపాధి అవకాశాలు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు సూచించారు. సోమవారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేకేసీ ఆధ్వర్యంలో 2024-25 శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఆంగ్లభాషపై పట్టు సాధించడం ద్వారా ఇంటర్వ్యూలలో విజయం సాధించడం సులభతరం అవుతుందని జేకేసీ కోఆర్డినేటర్ ఎన్.షర్మిల రాణి అన్నారు. ప్రతి ఏడాది శిక్షణపూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించి, సర్టిఫికెట్‌ను అందించడంతో పాటు జాబ్ డ్రైవ్ నిర్వహిస్తారని తద్వారా ఉద్యోగం సులభంగా పొందవచ్చని జేకేసీ మెంటర్ వినుకొండ రమేష్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జూమ్, మాక్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ వంటివి నిర్వహించారు.

శ్మశాన అభివృద్ధికి రూ.30లక్షలు మంజూరు

మేదరమెట్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మేదరమెట్లలో శ్మశాన అభివృద్ధికి రూ.30లక్షలు మంజూరు చేశారు. ఇటీవల వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ మృతి చెందారు. వైవీ సోదరులు తల్లి అంత్యక్రియలను మేరదమెట్లలో నిర్వహించారు. మేదరమెట్లలో పలు అభివృద్ధి పనులకు గతంలో నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు తాను టీటీడీ చైర్మన్‌గా ఉండగా మేదరమెట్లలో కల్యాణ మండపం నిర్మించారు. సుబ్బారెడ్డి తండ్రి చినపోలిరెడ్డి జ్ఞాపకార్థం ఆసుపత్రిని నిర్మించారు. ఇటీవల డిజిటల్ లైబ్రరీ భవనంలో అదనపు గది నిర్మాణానికి సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నుంచి నిధులిచ్చారు. మేదరమెట్ల తూర్పుపాలెంలో శ్మశానం ప్రహరీగోడ, గదినిర్మాణం, రహదారి అభివృద్ధికి రూ.30 లక్షలు రాజ్యసభ నిధుల నుంచి మంజూరు చేశారు. నిధులు కేటాయించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


సైన్స్ ఎగ్జిబిషన్‌లో నమూనాలను పరిశీలిస్తున్న సీఐ శేషగిరిరావు, శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ రవికుమార్

ప్రయోగాలపై పరిజ్ఞానం అవసరం

విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్‌లో సీఐ శేషగిరిరావు

మార్టూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కొత్త విషయాలని తెలుసుకోవాలి, వాటిని కనుగొనాలి, పరిశోధనాత్మకమైన పరిజ్ఞానంపై విద్యార్థి దశలోనే ఆలోచనలు కలగాలని సీఐ ఎం.శేషగిరిరావు అన్నారు. సోమవారం మార్టూరులో శ్రీహర్షిణి విద్యాసంస్థలో హైస్కూలు విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. విద్యార్థులు కలిసి మెలిసి తయారుచేసిన 67 నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమానికి సీఐ ఎం.శేషగిరిరావు, శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, రోటరీ మాజీ అధ్యక్షుడు జాష్టి సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రదర్శనలను తిలకించారు. సాంకేతికంగా, శాస్త్రపరంగా విద్యార్థుల ఆలోచనలకు రూపకల్పన చేసి, వారి చిన్న బుర్రలో పెద్ద పెద్ద ఆలోచనలతో చేసిన ప్రయోగాత్మకాలను అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఆలోచనలు చేయాలని ప్రోత్సహించారు. చంద్రయానం, విద్యుత్ ఆదా తదితర నమూనాలు ఆకట్టుకున్నాయి. వారికి సైన్స్ ఉపాధ్యాయినులు నీలిమ, అనూష్, సురేష్ తదితరులు మార్గదర్శకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, ఏవో అజయ్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ప్రపంచ అధ్యయనం


ప్రిన్సిపాల్ మురళికి సాహిత్య పుస్తకాలను అందజేస్తున్న ప్రతినిధులు

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాల పఠనంతో ప్రపంచాన్ని అధ్యయనం చేయవచ్చని. యువతరం ప్రత్యేకమైన పుస్తకాలపై దృష్టి సారించాలని తిరుపతి తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మురళి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనంపై ప్రణాళిక ఉండాలన్నా రు. అలాగే ప్రపంచంపై పట్టుతో పాటు ప్లాస్టిక్‌పై యువత పోరుబాట పట్టాలన్నారు. అనంతరం కళాశాల లైబ్రరీకు విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డా.వెంకట కృష్ణయ్య, డా.ఎస్ శ్రీకాంత్, డా.నాగేశ్వరరెడ్డి, రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ నీలా కుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొండమంజులూరులోని శ్రీ రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. గ్రామంలో పునర్ నిర్మించిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రి గొట్టిపాటి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి గొట్టిపాటికి ఆలయ అర్చకస్వామి ఆశీర్వచనం అందచేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, బత్తుల వెంకటరావు, మొప్పూడి వీరయ్య, దొప్పలపూడి వీరయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదంపై హర్షం

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ముగింపు చెప్తూ కేబినెట్ కమిటీ ఆమోదించిన సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పూనూరి నరేంద్ర, ఎంఈఎఫ్ గౌరవ అధ్యక్షుడు పసుమర్తి కోటయ్య, అనపర్తి రమేష్, గంగవరపు సిద్దు, వంగివరపు రమేష్, చక్రవర్తి, కోటేశ్వరరావు, సాల్మన్, ఉదయ్ కుమార్, అనిల్ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు

వడ్డీలేని రుణాలతో ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే కొండయ్య
- పొదుపు సంఘాలకు రూ.20లక్షల చెక్కుల అందజేత

చీరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాలలో అందించే వడ్డీలేని రుణాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎం అజయ్ పథకం ద్వారా నియోజకవర్గంలోని 12 మంది స్వయం సహాయక సభ్యులకు రూ.20లక్షలు ఎస్సీ కార్పొరేషన్ వడ్డీలేని చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా అందించే రుణాలతో జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుని సంతోషంగా జీవించాలని కోరారు. అలాగే పొదుపు సంఘాల మహిళలకు రుణాలు కల్పించి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీ సుబ్బారావు, ఫణి, వెలుగు ఏపీఎంలు మధు, అంజిబాబు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.


చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన వెలుగు అధికారులు

పలు కుటుంబాలు టీడీపీలో చేరిక

వేటపాలెం కాంగ్రెస్ పార్టీకు చెందిన 20 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పల్లప్రోలు శ్రీను, కొత్త నాగు ఆధ్వర్యంలో చేరిన ప్రతినిధులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కొండయ్య వారికి సూచించారు.

అన్యాక్రాంతాలపై చర్యలు తీసుకోండి

మునిసిపల్ పరిధిలోని 31,32,33 వార్డుల్లో ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారని, 31వ వార్డు కౌన్సిలర్ సల్లూరి సత్యానందం ఎమ్మెల్యే కొండయ్యకు ఫిర్యాదు చేశారు. ఏళ్ల తరబడి వార్డుల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రికవరీ చేసిన వాటిల్లో నిరుపేదలకు స్థలాలు కేటాయించాలని ఎమ్మెల్యేను కౌన్సిలర్ కోరారు.


చక్రాయపాలెంలో చెత్త తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

పారిశుధ్యం మెరుగునకు సహకరించండి

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చేపడతున్న కార్యక్రమాలకు గ్రామస్థులంతా సహకరించాలని ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు కోరారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న పేడ దిబ్బలను, చెత్త చెదారాన్ని ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అన్ని గ్రామాలల్లో రోడ్డు వెంబడి ఎటువంటి దిబ్బలు, చెత్త చేదారం ఉన్న తొలగించడం జరుగుతుందని అందుకు ప్రజలు ముందుగానే వాటిని తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్లా నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకులు రాజశేఖర్ పాల్గొన్నారు.


చిన్నగంజాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు

మామిడిలో సస్యరక్షణపై అవగాహన

చిన్నగంజాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) మామిడి పంటలో సస్యరక్షణ చర్యలపై సోమవారం చిన్నగంజాంలో ఉద్యానవనశాఖ అధికారి లేఖ్య అధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల పరిశోధన కేంద్రానికి చెందిన సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు ప్రస్తుత పంట పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మామిడి పూత పిందె కాయ దశలో ఉందన్నారు. కాయలు రాలకుండా ప్లానోఫిక్స్ ఒక మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఒక వేళ మాడిమి తోటలో తామర పురుగు ఉన్నట్లతే దాని నివారణకు వేప నూనె 10,000 పీపీఎం మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ కిషోర్, విహెచ్ఏ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవకులకు ఉత్తమ అవార్డులు

అద్దంకిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ క్షయ నిర్మూలన దినము సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో ఉత్తమ సేవలందిస్తున్న అధికారులు అవార్డులకు ఎంపికయ్యారు. సోమవారం బాపట్ల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ అధికారులుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అద్దంకి మండలంలోని మోదేపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్న షేక్ అబ్దుల్ సత్తార్ ఉత్తమ ఆరోగ్య పర్యవేక్షకునిగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అద్దంకి టీబీ యూనిట్‌లో పనిచేస్తున్న బీ రాజశేఖర్‌కు ఉత్తమ సీనియర్ టెక్నికల్ సూపర్‌వైజర్‌గా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ సత్తార్, రాజశేఖర్‌లను పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది అభినందించారు.



జిల్లా వైద్య అధికారి డాక్టర్ విజయమ్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అబ్దుల్ సత్తార్



వెంకటేశ్వర్లుకు ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డును అందజేస్తున్న విజయమ్మ

వెంకటేశ్వర్లుకు ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డ్

బల్లికురవ : ప్రపంచ టీబీ డే సందర్భంగా గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కే వెంకటేశ్వర్లును ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ అవార్డుతో సోమవారం ఘనంగా సత్కరించారు. గుంటుపల్లి పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు చేసేందుకు అన్ని వసతులు ఉండడంతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ విధులలో బాధ్యగా పనిచేస్తూ ప్రజలకు సేవలు అందిస్తుండడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించి జిల్లా కేంద్రం బాపట్లలో ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేశ్వర్లును వైద్యాధికారులు రమీజ్ అహ్మద్, రవితేజ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీబీ ఆఫీసర్ మహ్మద్ సాధిక్ మలేరియా అధికారి గోపీనాథ్ పాల్గొన్నారు.